


# బలగం TV
BALAGAM
నిజమే మా బలం..ప్రజలే మా బలగం
BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com
హైదరాబాద్ శుక్రవారం, 14 ఆగస్టు-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8





## పిల్లల ఆరోగ్యంపై
# ఆటలొద్దు

- ఆహార పదార్థాల ప్యాకెట్లపై లేబుల్ వేయాల్సిందే
- మీతో కాకపోతే మేమే ఆ పని చేస్తాం
- కేంద్రానికి సుప్రీం కోర్టు చురకలు



న్యూఢిల్లీ, ఆగస్టు 13 : అధిక మోతాదులో ఉప్పు, చక్కెర, సంతృప్త కొవ్వులు ఉండే ఆహార పదార్థాల ప్యాకెట్లపై లేబుల్స్ ఏర్పాటు చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు గురువారం గట్టి హెచ్చరిక చేసింది. 'మీరు చేయలేకపోతే మేమే చేస్తాం' అంటూ కేంద్రానికి తేల్చి చెప్పింది. ప్రజల ఆరోగ్యానికి, ముఖ్యంగా పిల్లల ఆరోగ్యానికి సంబంధించిన అంశాల్లో కార్పొరేట్ ఒత్తిళ్లకు తలొగ్గకూడదని స్పష్టం చేసింది. జస్టిస్ జేబీ పర్దీవాలా, జస్టిస్ కే వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం ఈ అంశంపై దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది. ఆహార పదార్థాలపై హెచ్చరిక లేబుల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ (ఈఎస్ఎస్ఏఐ) వ్యవహరిస్తున్న తీరుపై ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అధిక చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వుల గురించి అవగాహన కలిగించేందుకు ప్యాకెట్ల ముందు భాగంలో స్పష్టమైన హెచ్చరికలు ఉండాలని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. ఈ విషయంలో ఆహార పరిశ్రమ అభ్యంతరాలను మాత్రమే ఎఫ్ఎస్ఎస్ఏఐ పరిగణనలోకి తీసుకుందన్నారు. హార ప్యాకెట్లపై హెచ్చరిక గుర్తులకు బదులుగా అదనపు చక్కెర, సంతృప్త కొవ్వులు, ఉప్పు మొదలైన వాటిని రోజుకు ఎంతో తీసుకోవచ్చో పట్టిక రూపంలో చూపించే విధానాన్ని ఎఫ్ఎస్-ఎస్ఏఐ సూచించింది. అయితే ఈ విధానం వినియోగదారులకు అవసరమైనంత అవగాహన అందించదనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకున్న చర్యలపై సుప్రీంకోర్టు ప్రశ్నలు సంధించింది. గతంలో కోర్టు ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదని, ఇప్పటివరకు ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుందని ధర్మాసనం ప్రశ్నించింది. హెచ్చరిక లేబుల్స్ వల్ల ఉత్పత్తుల విక్రయాలపై ప్రభావం పడుతుందని తయారీదారులు అభ్యంతరం వ్యక్తం చేయవచ్చని కోర్టు పేర్కొంది. అయితే తాము తినే ఆహారంలో ఎంత చక్కెర, ఉప్పు, సంతృప్త కొవ్వు ఉందో తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉందని స్పష్టం చేసింది. హెచ్చరిక ఉన్నప్పటికీ ఉత్పత్తిని కొనాలా, వద్దా అనే తుది నిర్ణయం వినియోగదారుడిదేనని తెలిపింది. హెచ్చరిక లేబుల్స్‌కు సంబంధించిన ప్రతిపాదనపై చర్యలు తీసుకునేందుకు కేంద్రానికి సుప్రీంకోర్టు రెండు వారాల గడువు ఇచ్చింది. తదుపరి విచారణ సమయంలో అవసరమైతే తుది ఆదేశాలు జారీ చేస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది.



# సంక్షేమాన్ని రెట్టింపు చేసాం

- పదేళ్ల బిఆర్ఎస్.. రెండేళ్ల కాంగ్రెస్ పాలనను బేరీజు వేయండి
- రాష్ట్రం ఎండిపోవాలని కుట్రలు చేశారు
- వారు చేసిన చేతబడి తిరగబడింది
- నగరంలో పేదలకు లక్ష ఇళ్లు నిర్మిస్తున్నాం
- ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపనలో సిఎం రేవంత్



రజని వాయిస్-హైదరాబాద్: పదేళ్ల బీఆర్ఎస్, రెండేళ్ల కాంగ్రెస్ పాలనను ప్రజలు బేరీజు వేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. గతంలో ఉన్న పథకాలకు అదనంగా సంక్షేమాన్ని అందిస్తున్నామని చెప్పారు. హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ కాలనీలో క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల టవర్ల నిర్మాణానికి సీఎం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేదల రుణం తీర్చుకునే అవకాశం వచ్చిందని.. ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. బీఆర్ఎస్ నేతలపై సీఎం విమర్శలు చేశారు. రాష్ట్రం ఎండిపోవాలని కుట్ర చేశారని ఆరోపించారు. చేతబడుల కోసం కొందరు కర్ణాటక వెళ్లారు. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు కేసీఆర్ పరిస్థితి ఉంది. అందుకే అల్లుడు క్షుద్రపూజలు చేశారు. మీరు చేసిన చేతబడి మీపైనే తిరగబడి అష్టదిగ్బంధనం చేస్తుంది. ఫాంహౌస్ నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి వస్తుంది. నా సంకల్పం రాష్ట్రం బాగుకోసం.. అందుకే వర్షాలు పడుతున్నాయి. పదేళ్లు అధికారంలో ఉన్నవారు చేతబడులు చేయిస్తారా? అని రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు అండగా ఉంటానన్నారు. కూకట్‌పల్లి ప్రజలకు కావాల్సిన పనులు చేయించాలని మంత్రులను ఆదేశిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. మహిళలకు ఉచిత బస్సు పథకం కింద రూ.12వేల కోట్లు చెల్లించాం. మహిళా సంఘాలకు రూ.65వేల కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందించాం. మహిళలకు ఉచిత బస్సు పథకం బంద్ చేయించాలని విపక్ష నేతలు ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టారు. 55 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. రాష్ట్రంలో కోటి మంది ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరలు అందించాం. మహిళా సంఘాలకు

మిగతా 3లో..

## త్వరలో కోల్
# ఎక్స్ఛేంజ్ ఏర్పాటు



- దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే ధర
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 13:దేశవ్యాప్తంగా బొగ్గుకు ఒకే ధర ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. త్వరలో కోల్ ఎక్స్ఛ ంజ్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడిం చారు. దీనివల్ల విద్యుత్ ఉత్పత్తి వ్యయం తగ్గి వినియోగదారులకు తక్కువ ధరకు విద్యుత్ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 2018 నుంచి బొగ్గు ధరలను పెంచలేదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అదే విధంగా సిమెంట్, స్టీల్ వంటి రంగాలకు సంబంధించిన ధరల విషయంలోనూ పెరుగుదలను నియంత్రించే చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మినరల్స్ అం శంలో రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం పెత్త నం చేయబోదని కిషన్‌రెడ్డి స్పష్టం చేశా రు. పన్నులు, సెస్‌ల విషయం లోనూ కేం ద్రం జోక్యం చేసుకోదని తెలిపారు. రాష్ట్రాలకు ఉన్న హక్కులు, అధికారాలను గౌరవిస్తూనే ఖనిజ రంగ అభివృద్ధికి కేంద్రం సహకరిస్తుందని చెప్పారు. దేశం లో మినరల్స్ ఉత్పత్తిని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని కిషన్‌రెడ్డి తెలిపారు.

# 30వేలు లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన ఆర్ఐ




కరీంనగర్,ఆగస్ట్13 : బీర్ పూర్ మండల కేంద్రంలో ఏసీబీ డీఎస్పీ గట్ల మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో గురువారం బీర్పూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడి నిర్వహించారు. ఓ బాధితురాలి నుంచి రూ.30 వేల లంచం తీసుకుంటున్న గిరిధావర్(ఆర్) రాహుల్‌ను ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటనపై ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. కాగా ఆర్ఐ రాహుల్ గతంలో కథలాపూర్ ఆర్ఐ-1 గా విధులు నిర్వహించగా సర్టిఫికెట్ల జారీలో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయడంతో బీర్పూర్ కు బదిలీ చేశారు. కాగా ఏసీబీ అధికారుల విచారణ కొనసాగుతోంది.

## మైనార్టీ రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే



- కొందరు 4శాతం రిజర్వేషన్లపై కోర్టు మెట్లెక్కారు
- ఇంటింటికీ వెళ్లి ఓట్ల గల్లంతును పరిశీలించండి
- మైనార్టీల ప్రతిభా సదస్సులో సిఎం రేవంత్ రెడ్డి

2లో..

## యూరియా యాప్‌పై
# రైతుల ఆగ్రహం

- సింగిల్ విండోలో అధికారులను బంధించి నిరసన

కరీంనగర్,ఆగస్ట్13 : గంభీరావుపేట మండలంలోని కొత్తపల్లి సింగిల్ విండో కార్యాలయానికి రైతులు గురువారం తాళం వేసిఅందులో సిబ్బందిని బంధించారు. యూరియా యాప్ తో రైతులకు ప్రభుత్వం చుక్కలు చూపిస్తున్నాదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ సిబ్బందిని బంధించి సింగిల్ విండో కార్యాలయానికి తాళం వేశారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు కొత్తపల్లి సింగిల్ విండోలో 400బస్తాల యూరియా బ్యాగ్‌లు అందుబాటులో ఉంటాయని అధికారులు సందేశం అందించారు.యాప్ టెక్నికల్ సమస్య కారణంగా ఓపెన్ కాక పోవడంతో అన్నదాతలు ముకుమ్మడిగా సింగిల్ విండో కార్యాలయం దగ్గరికి దూసుక వచ్చి ఆందో ళనకు దిగారు. యాప్ లో టెక్నికల్ సమస్య ఉందని సిబ్బంది పొంతన లేని సమాచారం ఇవ్వడంతో వారిని కార్యాలయంలో బంధించి తాళం వేసి ఎదుట ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు సుంకోజి శ్రీనివాస్, గ్రామ రైతులు ఉన్నారు.

## లిఫ్ట్‌లో ఇరుక్కుని ఇద్దరు
# టెక్నీషియన్ల మృతి

వరంగల్,ఆగస్ట్13 : వరంగల్ జిల్లా గీసుగొండ మండలం శాయంపేట శివారులోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో గురువారం విషాద ఘటన చోటుచేసుకుంది. గణెళిశా ఎకోపెట్ క్లాత్ ఫ్యాక్టరీలో లిఫ్ట్‌లో ఇరుక్కుని ఇద్దరు సిబ్బంది మృతిచెందారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సాంకేతిక నిపుణులు అభిలాష్ (30), సూర్యప్రకాశ్ (31)గా మృతులను గుర్తించారు. అయితే, వారిద్దరూ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తూ లిఫ్ట్‌లో ఇరుక్కుపోయారు. ఈ ఘటనలో ఇద్దరూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. షార్ట్‌సర్క్యూట్ కారణం గానే ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి ప్రమాదానికి గల పూర్తి కారణాలపై ఆరా తీస్తున్నారు. లిఫ్ట్‌లో ప్రమాదం ఎలా జరిగింది? నిజంగానే షార్ట్‌సర్క్యూట్ జరిగిం దా? వంటి అంశాలపై దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు.

## ఆర్మూర్ వద్ద ఘోర
# రోడ్డు ప్రమాదం

### టూరిస్ట్ బస్సును ఢీకొన్న లారీ: ఇద్దరు మృతి

నిజామాబాద్,ఆగస్ట్13 : నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మండల పరిధిలోని గోవింద్‌పేట్ బ్రిడ్జి సమీపంలో జరిగిన ఈ ఘటనలో ఇద్దరు మృతి చెందగా.. మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కిన్వట్ ప్రాంతానికి చెందిన భక్తులు రెండు టూరిస్ట్ బస్సుల్లో హైదరాబాద్ ముచ్చింతల్‌లోని సమతామూర్తి స్ఫూర్తి కేంద్రానికి బయల్దేరారు. ఈ క్రమంలో గోవింద్‌పేట్ బ్రిడ్జి సమీపానికి రాగానే ఓ బస్సు పంక్చర్ అయింది. బస్సును హైవేపై నిలిపారు. బస్సులోని కొంతమంది ప్రయాణికులు కిందికి దిగి రహదారి మధ్యలోని డివైడర్‌పై కూర్చున్నారు. కాసేపటి తర్వాత వెనుక నుంచి వచ్చిన ఓ లారీ.. ఆగి ఉన్న బస్సును బలంగా ఢీకొట్టింది. దీంతో బస్సు ముందుకు కదిలి డివైడర్‌పై కూర్చున్న ప్రయాణికులపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో సుజాత (54), మాధవి (47) అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఇద్దరు మహిళలు సునీత, చిటక్కకు తీవ్రగాయాలు కావడంతో వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటనాస్థలాన్ని నిజామాబాద్ సీపీ పి.సాయిచైతన్య పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును స్థానిక పోలీసులను అడిగి తెలుసుకున్నారు.

## అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌కు మద్దతు



- ప్రభుత్వ మద్దతు లేకుంటే పనులు జరగవు
- మాజీ స్పీకర్ పోచారం మరోమారు హాట్ కామెంట్స్

వివరాలు 2లో..

## పారదర్శకంగా ఇళ్ల
# కేటాయింపు

- గత ప్రభుత్వం పేదలను దోచుకుంటే మేం ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 13: ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నేడు శంకుస్థాపన చేసుకున్న ఇంది రమ్మ టవర్స్ నుంచి వచ్చే ఏడాది బోనాలు ఎత్తిస్తామని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. గురు వారం సాయంత్రం కూకట్‌పల్లిలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన సభకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆనాటి ప్రభు త్వం కమిషన్లు రావన్న కారణంగా పేదలకు ఇళ్లు కట్టలేదని, కమిషన్లు వచ్చే కాళేశ్వరం ప్రాజె క్టుపైనే దృష్టి సారించిందని ఆరోపిం చారు. దీనికి భిన్నంగా ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం ఎకరా 200 కోట్ల రూపాయల వరకు ఉన్నప్పటికీ హైదరాబాద్ మహానగరంలో పెద్ద పెద్ద టవర్స్ పక్కనే పేదలకు కూడా ఇళ్లు నిర్మించాలని నిర్ణయించి ఆచరణలోకి తెచ్చిందన్నారు. హస్తం పార్టీ రాష్ట్ర ప్రజలకు మిగతా 3లో..

## తెలంగాణ ప్రాజెక్టుల అనుమతుల రద్దుకు కుట్ర



- జీఆర్‌ఎంబి ఎజెండా నుంచి ఈ అంశాన్ని తొలగించాలి
- ఎంపిలంతా ప్రధాని మోడీని కలసి వివరించాలి
- మాజీ ఎంపి వినోద్ కుమార్ డిమాండ్

వివరాలు 2లో..

బలగం TV BALAGAM

balagamtv100@gmail.com

# ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు

- వందేమాతరం గీతాలాపనతో లోక్‌సభ వాయిదా

న్యూఢిల్లీ,ఆగస్టు13 : పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ముగిశాయి. గురువారం ఉభయసభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. లోక్‌సభ ప్రారంభమైన తర్వాత సభ్యులంతా కలిసి వందేమాతరం గేయాన్ని ఆలపించారు. ఈ సమావేశానికి ప్రధాని మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్‌తోపాటు సభ్యులంతా హాజరయ్యారు. జాతీయ గేయంలోని ఆరు చరణాలను పూర్తిగా ఆలపించిన అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేశారు. దీంతో వర్షాకాల సమావేశాలు ముగిసినట్లు అయింది. వందేమాతరం గేయాన్ని చట్టపరంగా రక్షణ కల్పించే శాసనానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేసిన కొన్ని రోజులకే లోక్‌సభలో ఈ పరిణామం చోటు చేసుకుంది. జాతీయ గేయాన్ని ఆలపించడాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం లేదా నిరోధించడం శిక్షార్హమైన నేరమని ఈ చట్టం స్పష్టం చేస్తోంది. తద్వారా దీనికి జాతీయ గీతం 'జనగణమన'తో సమానమైన చట్టపరమైన హోదా లభించినట్లైంది. రాష్ట్రపతి రాక, త్రివర్ణ పతాకావిష్కరణ, గవర్నర్ల ప్రసంగం వంటి సందర్భాల్లో వందేమాతరంలోని ఆరు చరణాలను ఆలపించాలని జనవరి 28వ తేదీన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 20వ తేదీన ప్రారంభమై.. ఆగస్టు 13వ తేదీతో ముగిశాయి. నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్రం విద్య శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతోపాటు విద్యావ్యవస్థలో సంస్కరణలను డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆందోళన చేపట్టింది. జులై 20వ తేదీన వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో ఆ రోజు చలో పార్లమెంట్ యాత్రకు సీజేపీ పిలుపునిచ్చింది.

ఈ ఘటనతో చోటు చేసుకున్న తీవ్ర పరిణామాలతో మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. అదే విధంగా పార్లమెంట్ సమావేశాల్లో యాంటీ పేపర్ లీక్ బిల్లుతోపాటు పలు బిల్లులు ఆమోదం పొందాయి. అయితే.. ఢిల్లీలో యువతపై జరిగిన లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశాలు ఇచ్చారో సభలో ప్రకటన చేయాలంటూ కేంద్రాన్ని ప్రతిపక్షం కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో సభలో దాదాపుగా వాయిదాల పర్వం కొనసాగింది. చివరకు ఈ రోజు ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి.

# తెలంగాణ ప్రాజెక్టుల అనుమతుల రద్దుకు కుట్ర

- జీఆర్ఎంబీ ఎజెండా నుంచి ఈ అంశాన్ని తొలగించాలి
- ఎంపిలంతా ప్రధాని మోడీని కలసి వివరించాలి
- మాజీ ఎంపి వినోద్ కుమార్ డిమాండ్



రాజన్న సిరిసిల్ల,ఆగస్టు13 : తెలంగాణ ప్రాజెక్టుల అనుమతుల రద్దు కుట్రను అడ్డుకోవాలని, జీఆర్ఎంబీ ఎజెండా నుంచి అంశాన్ని వెంటనే తొలగించాలని బీఆర్ఎస్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. తెలంగాణ హక్కులపై భంగం కలుగుతుంటే బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు మౌనంగా ఎందుకుంటున్నారని ప్రశ్నించారు. సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య తదితరులతో కలసి మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 18న హైదరాబాద్‌లో జరగనున్న గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు ఎజెండా నుంచి తెలంగాణ ప్రాజెక్టుల అనుమతుల రద్దుకు సంబంధించిన అంశాన్ని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలోని పలు ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించడం, ఆ అంశాన్ని జీఆర్ఎంబీ సమావేశం ఎజెండాలో చేర్చడం తీవ్ర ఆందోళన కలిగించే విషయమని వినోద్‌కుమార్ అన్నారు. ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేస్తే తెలంగాణ రైతాంగం, సాగునీటి రంగం, రాష్ట్ర భవిష్యత్‌పై తీవ్ర ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. తెలంగాణ ఎంపీలందరూ వెంటనే ఢిల్లీకి వెళ్లి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసి , తెలంగాణ ప్రాజెక్టుల అనుమతుల రద్దు అంశాన్ని తొలగించేలా ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్ వేదికగా కూడా ఈ అంశంపై తెలంగాణ తరఫున గట్టిగా పోరాడాలని కోరారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిపై విమర్శలు జీఆర్ఎంబీ బీఆర్ఎస్ పార్టీ బహిష్కరించాలని కోరుతోందంటూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని వినోద్‌కుమార్ విమర్శించారు. జీఆర్ఎంబీ సమావేశాన్ని బహిష్కరించాలన్నది బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ కాదని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేస్తే రాష్ట్రంలో తీవ్ర విపత్కర పరిస్థితులు తలెత్తే ప్రమాదం ఉందని వినోద్‌కుమార్ హెచ్చరించారు.

# ప్రజలకు జవాబుదారులుగా అధికారులు




- అంకిత భావంతో ప్రజల సమస్యలను పరిష్కరించాలి
- సీఎం రేవంత్ రెడ్డి నమ్మకాన్ని ఎం.పీ.డీ.వో.లు నిలబెట్టుకోవాలి
- రాష్ట్ర స్థాయి ప్రజావాణి ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి

హైదరాబాద్,ఆగస్ట్13 : ప్రజలకు జవాబుదారులం అనే విష యాన్ని అధికారులు ఎట్టి పరిస్థితుల్లోనూ విస్మరించవద్దని, ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి అధికారి అంకితభావం, బాధ్యతతో విధులు నిర్వహించాలని రాష్ట్ర స్థాయి ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అన్నారు. గురువారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో నిర్వహించిన మండల నోడల్ అధికారులైన ఎంపీడీవోల శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం గ్రామాల నుంచి వచ్చే ప్రజలతో ఓపికగా మాట్లాడి వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి వాటిని క్షేత్రస్థాయిలోనే పరిష్కరించే గురుతర బాధ్యత మండల నోడల్ అధికారి, వివిధ శాఖల మండల అధికారులపై ఉందని పేర్కొన్నారు. ప్రజలే దేవుళ్ళని వారికి సేవలు అందించడం అధికారుల కనీస బాధ్యత అని చిన్నారెడ్డి గుర్తు చేశారు. ఎంపీడీవో లకు మండల ప్రజావాణి నోడల్ అధికారిగా ఎంతో నమ్మకంగా నియమించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విశ్వాసాన్ని వారు నిలుపుకోవాలని, ప్రజావాణి ద్వారా సమస్యలను పరిష్కరించి ప్రజల మన్ననలు పొందాలని చిన్నారెడ్డి పిలుపునిచ్చారు. ప్రజావాణి పేదవారి సమస్యల పరిష్కార వేదికగా మారాలని ఆయన అన్నారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న సీఎం ప్రజావాణి 75శాతం సక్సెస్ రేటును సాధించిందని, ఇదే స్థాయిలో సమస్యలకు పరిష్కరిస్తూ జిల్లా, మండల స్థాయి ప్రజావాణి అదుకారులు కృషి చేయాలని చిన్నారెడ్డి సూచించారు. మండల స్థాయి ప్రజావాణిలో బాధ్యతలు నిర్వహించే అధికారులు సమన్వయంతో విధులు నిర్వహిం చాలని, విధి నిర్వహణలో ఎలాంటి లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని చిన్నారెడ్డి పేర్కొన్నారు. ఈనెల 17 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా తొలిసారిగా ప్రారంభం కానున్న మండలస్థాయి ప్రజావాణి కార్యమాలకు అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేసుకుని సిద్ధంగా ఉండాలని చిన్నారెడ్డి సూచించారు. సీఎం ప్రజావాణి మాదిరిగానే మండల స్థాయిలోనూ శాఖల వారీగా డెస్క్ లు, ప్రజల దరఖాస్తులు రాసేందుకు హెల్ప్ డెస్క్ లు, వైద్య సేవలు, తాగు నీరు ఏర్పాట్లు చేసుకోవాలని, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని చిన్నారెడ్డి అన్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల కమిషనర్ దివ్య దేవరాజన్ మాట్లాడుతూ ప్రజావాణికి వచ్చే ప్రజల సమస్యలను ఓపికగా వింటే సగం సమస్య పరిష్కారం అయినట్లేనని, సమస్యల పరిష్కారం కోసం గట్టి చర్యలు చేపట్టాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహణకు తీసుకోవాల్సిన అనేక అంశాలను పవర్ పాయింట్ ప్రెసెంటేషన్ ద్వారా నిపుణులు వివరించారు. కార్యక్రమంలో ప్రణాళిక శాఖ డైరెక్టర్ షేక్ మీరా, సీఎం ప్రజావాణి ఏ.సీ.పీ. ఉమేందర్, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ అధికారి సుశీల, సీఎం ప్రజావాణి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మైనార్టీ రిజర్వేషన్లు కల్పించిన ఘనత కాంగ్రెస్‌దే

- కొందరు 4శాతం రిజర్వేషన్లపై కోర్టు మెట్లెక్కారు
- ఇంటింటికీ వెళ్లి ఓట్ల గల్లంతును పరిశీలించండి
- మైనార్టీల ప్రతిభా సదస్సులో సిఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 13: ముస్లిం మైనారిటీ రిజర్వేషన్లు అడ్డుకునేందుకు కొన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ముస్లింలకు కాంగ్రెస్ 4 శాతం రిజర్వేషన్లు కల్పించిందని, వీటిని అడ్డు కునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. రిజర్వేషన్ల రద్దు కోసం అత్యున్నత న్యాయస్థానాల వరకూ వెళ్లారని ముఖ్యమంత్రి విమర్శించారు. అయినా చిత్తశుద్ధితో కాంగ్రెస్ అమలు చేసింద న్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మైనారిటీల ప్రతిభా సదస్సుకు సీఎం రేవంత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన పలువురు మైనారిటీలకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. మైనారిటీ రిజర్వేషన్లకు ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యతిరేకమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ, సోనియా గాంధీ నేతృత్వంలోనే మైనారిటీలకు సంక్షేమం అందుతోందని చెప్పారు. కాంగ్రెస్ అంటేనే సెక్యులర్ పార్టీ అని, హిందూ, ముస్లింలను రెండుకళ్లలా చూస్తోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గత బీఆర్ఎస్ ప్రభుత్వంపైనా ముఖ్యమంత్రి విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం గ్రూప్-1 పరీక్షలను నిర్వహిం చలేకపోయిందని ఎద్దేవా చేశారు. ఓ ఆర్ఎంపీ డాక్టర్‌ను టీజీపీఎస్సీ సభ్యుడిగా నియమించారని సీఎం ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఉన్నంతకాలం దేశంలో సెక్యులర్ వర్గాలకు మనుగడ ఉంటుందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హిందూ, ముస్లింలను రెండు కళ్లలా కాంగ్రెస్ చూస్తోందని చెప్పారు. నగరంలోని కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో మైనారిటీస్ ఎక్స్‌లెన్స్ సమ్మిట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్‌తో కలిసి సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో మైనార్టీలకు 4శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ ఇచ్చి ంది. వాటిని రద్దు చేయాలని కొందరు హైకోర్టు, సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గుజరాత్‌లో మైనార్టీ రిజర్వేషన్లు రద్దు చేసి చూపాలని సవాల్ విసిరాం. లౌకిక వర్గాల కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పోరాడుతుంది. బాక్సింగ్ క్రీడాకారిణి నిఖత్ జరీన్‌కు గ్రూప్-1 ఉద్యోగం, రూ.3కోట్ల ప్రోత్సాహకం ఇచ్చాం. బీఆర్ఎస్ హయాంలో గ్రూప్-1 నియామకాల ఊసే లేదు. ఒకసారి నియామకాలు చేపట్టినా పల్లీ, బఠానీల్లా ప్రశ్నపత్రాలు అమ్మారు. మా ప్రభుత్వం వచ్చాక టీజీపీఎస్సీని ప్రక్షాళన చేశాం. అందులో విద్యావంతులను నియమించాం. టీజీపీఎస్సీ ద్వారా గ్రూప్-1 పోస్టులు భర్తీ చేశాం. గ్రూప్-1 రద్దు చేయాలని బీఆర్ఎస్ నేతలు సుప్రీంకోర్టు వరకు వెళ్లారు. అక్కడ మంచి న్యాయవాదిని పెట్టి వాదనలు వినిపించాం. తద్వారా నియామకాలు పూర్తిచేశాం. గ్రూప్ 2, 3, 4 పోస్టుల విషయంలోనూ కోర్టుల్లో పోరాడి ఉద్యోగాలు భర్తీ చేశాం'అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. యూపీఎస్సీ తరహాలో టీజీపీఎస్సీని బలోపేతం చేశామని ధీమా వ్యక్తం చేశారు. రిటైర్డ్ డీజీపీని టీజీపీఎస్సీ ఛైర్మన్‌గా నియమించామని చెప్పుకొచ్చారు. ఎంతో పారదర్శకంగా గ్రూప్-1 పరీక్షలు నిర్వహించామని తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన నిఖత్ జరీన్ కోసం నిబంధనలు పక్కనపెట్టి మరీ గ్రూప్-1 ఉద్యోగం ఇచ్చామని, అలాగే క్రికెటర్ సిరాజ్‌కు డీఎస్పీ ఉద్యోగం కల్పించామని సీఎం రేవంత్ గుర్తు చేశారు. మైనారిటీ యువత చదువుతో పాటు నైపుణ్యం సంపాదించాలని కోరారు. జర్మనీ, జపాన్ లాంటి దేశాల్లో ఎన్నో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు స్కిల్స్ యూనివర్సిటీ కూడా ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. సందర్భంగా తాను అందరి సహకారంతోనే తెలంగాణ ముఖ్యమంత్రి స్థాయికి చేరుకున్నట్లు రేవంత్ చెప్పుకొచ్చారు. సర్ పేరుతో ఓట్లు తొలగించాలని కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. బెంగాల్‌లో గెలిచామని, ఇక తెలంగాణనే టార్గెట్ అని కొందరు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అక్కడ మమతా బెనర్జీ వదిలేశారేమో కానీ, ఇక్కడ కాంగ్రెస్ కార్యకర్తలు వదిలిపెట్టరని హెచ్చరించారు. 'గల్లీ గల్లీ తిరగండి, ఇంటింటికీ వెళ్లండి.. ప్రతీ ఒక్కరి ఓటును చెక్ చేయండి' అంటూ కార్యకర్తలకు సీఎం పిలుపునిచ్చారు. ప్రతీ ఒక్కరూ ఒక రేవంత్ రెడ్డిలాగా మారి ప్రజల ఓటు హక్కును కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

# రైలు ఢీకొని టీచర్ మృతి

మహబూబాబాద్,ఆగస్ట్13 : జిల్లాలో విషాద ఘటన చోటు చేసుకుంది. పుష్‌పుల్ రైలు ఢీకొని ఓ ఉపాధ్యాయుడు దుర్మరణం చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. మైనార్టీ గురుకుల పాఠశాలలో మ్యాథ్స్ టీచర్‌గా పని చేస్తున్న ఎండీ గౌస్‌మియా మహబూబాద్ రైల్వే స్టేషన్‌లో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. గౌస్‌మియా మృతిపట్ల పలువురు సంతాపం తెలిపారు.

## ఆబిడ్స్‌లో మహిళపై దూసుకెళ్లిన కారు

### కారు సినీ నిర్మాత పోలీసుల కేసు నమోదు

హైదరాబాద్,ఆగస్ట్13:నగరంలోని అబిడ్స్‌లో ఓకారు బీభత్సం సృష్టించింది. నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్న ఓ మహిళను కారు ఢీకొట్టడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. గన్‌ఫౌండ్రీ ఎస్‌బీఐ బ్యాంకులో హౌస్‌కీపింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న సునీత.. విధులు ముగించుకుని ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ క్రమంలో సినిమా నిర్మాత డ్రైవర్ మహానంద నడు పుతున్న కారు ఒక్కసారిగా ఆమెపైకి దూసుకెళ్లినట్లు బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రమాదంలో సునీత కాలుకు ఫ్రాక్చర్ కావడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆమెను సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన కారు యజమాని.. ఫిల్మ్ ప్రొడ్యూసర్ బొమ్మకు మురళి యజమాని అని బాధితురాలి కుటుంబ సభ్యులు తెలిపారు. ఘటన అనంతరం ఆయనకు ఫోన్ చేసి సునీత చికిత్సకు అయ్యే ఖర్చులను భరించాలని కోరినట్లు చెప్పారు. అయితే డబ్బులు ఇవ్వనని దురుసుగా సమాధానం ఇచ్చినట్లు వారు వాపోయారు. వారి ఫిర్యాదు మేరకు.. అబిడ్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అంత్యక్రియలకు వచ్చి.. చెరువులో దిగి ఇద్దరు మృత్యువాత



సంగారెడ్డి,ఆగస్ట్13 : జిల్లాలో విషాద ఘటన చోటు చేసు కుంది. జిన్నారం మండలం వావిలాల గ్రామంలో చెరువులో స్నానానికి వెళ్లిన ఇద్దరు వ్యక్తులు మృ తి చెందారు. బం ధు వు అంత్య క్రియలకు హాజర య్యేందుకు వచ్చిన గణెళిష్ (30), మునిరాజు (58) ప్రాణాలు కోల్పోయారు. అంత్యక్రియలు పూర్తయిన అనంతరం ఇద్దరూ చెరువులో స్నానం చేసేందుకు వెళ్లారు. ఈ క్రమంలో గణెళిష్‌కు ఒక్కసారిగా మూర్ఛ రావడంతో అదుపు తప్పి నీటిలో పడిపోయాడు. చెరువులో మునిగిపోతున్న గణెళిష్‌ను గమనించిన మునిరాజు.. కాపా డేందుకు వెంటనే నీటిలోకి వెళ్లాడు. అయితే గణెళిష్‌ను రక్షించే ప్రయత్నంలో మునిరాజు కూడా నీటిలో మునిగిపోయాడు. ఇద్దరూ చాలాసేపు బయటకు రాకపోవడంతో అక్కడ ఉన్నవారు ఆందోళనకు గురయ్యారు. వెంటనే సమాచారం అందడంతో స్థానికులు చెరు వు వద్దకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. చివరకు ఇద్దరి మృతదేహాలను బయటకు తీసినట్లు సమాచారం. అంత్యక్రియలకు హాజరైన కుటుంబాల్లో ఈ ఘటన మరో తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

# బిసి మహిళలకు స్వయం ఉపాధి



### ఉచిత కుట్టుమిషన్లు ప్రారంభించిన మంత్రి పొన్నం

హైదరాబాద్,ఆగస్ట్13 : బీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి స్వయం ఉపాధిని ప్రోత్సహించేం దుకు ఉచిత కుట్టుమిషన్ల పంపిణీ కార్యక్రమాన్ని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సచివాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలనలో బీసీ మహిళల స్వయం ఉపాధి, ఆర్థిక సాధికారతకు పెద్దపీట వేస్తున్నామని పొన్నం చెప్పారు. బీసీ మహిళలకు 100 శాతం సబ్సిడీపై ఆటోమేటిక్ కుట్టుమిషన్లు అందిస్తామని.. వారిని కేవలం లబ్ధిదారులుగా కాకుండా స్వయం ఉపాధి పొందే మహిళా పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1,19,000 కుట్టు మిషన్లను పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ఒక్కో దాని విలువ రూ.12,000 కాగా, లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా 100 శాతం సబ్సిడీపై అందజేస్తామని చెప్పారు. ఆగస్టు 15 నుంచి సెప్టెంబర్ 15 వరకు అర్హులైన బీసీ మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు మంత్రి వెల్లడించారు.

# పంద్రాగస్టు ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి

- ప్రోటోకాల్‌ను తప్పక పాటించాలి
- విద్యుత్, త్రాగునీరు, ఇతర సదుపాయాలు సమకూర్చాలి
- అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలి
- స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్



హైదరాబాద్,ఆగస్టు13 : రవాణా, ఆర్ అండ్ బి శాఖల స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్ పంద్రాగస్టు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శనివారం గోల్కొండ కోటలో నిర్వహించనున్న స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు జరిగే ప్రాంతాన్ని గురువారం సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి ఆయన పరిశీలించి, ఏర్పాట్లపై దిశానిర్దేశర చేశారు. వర్షాకాలం నేపథ్యంలో కార్యక్ర ఓమంలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా వాటర్‌ప్రూఫ్ షామియానాలు, వాటర్‌ప్రూఫ్ జనరేటర్, నిరంతర విద్యుత్ సరఫరా, త్రాగునీరు, బారికేడింగ్, గ్యాలరీలు, వచ్చే అతిథులు, విద్యార్థులు, ప్రజల సీటింగ్ సామర్థ్యం, సౌండ్ సిస్టమ్ తదితర ఏర్పాట్లను ఉన్నతస్థాయి అధికారులతో కలిసి ఆయన సమీక్షించారు. కార్యక్రమ నిర్వహణలో ఎక్కడా ప్రోటోకాల్‌కు ఇబ్బంది కలగకుండా అధికారులు నిబద్ధతతో వ్యవహరించాలని ఆయన సూచించారు. అదేవిధంగా స్టేజీ ఏర్పాటుతో పాటు సుందరీకరణ పనులను వేగవంతంగా చేపట్టాలని సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నందున ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రతి వాహనంలో వచ్చే పిల్లలకు ఒక లైజనింగ్ అధికారి తప్పనిసరిగా ఉండేలా చూడాలని విద్యా శాఖ అధికారులను ఆదేశించారు.పంద్రాగస్టు రోజున గౌరవ ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు కార్యక్రమానికి హాజరుకానున్న నేపథ్యంలో ఏర్పాట్లు ఘనంగా ఉండాలని, ఎక్కడా ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఏర్పాట్లను పక్కాగా, వేగవంతంగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. ముఖ్యమంత్రికి సమర్పించే పోలీసుల గౌరవ వందనం, పోలీస్ కవాతును ఆయన ఉన్నతా ధికారులతో కలిసి వీక్షించారు. కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అహ్మద్ నదీమ్, సమాచార శాఖ కమిషనర్ జి. ము కుంద రెడ్డి, అడిషనల్ డీజీపీ సంజయ్ కుమార్ జైన్, స్వా తి లక్రా, సీపీ సజ్జనార్, అడిషనల్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్, ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్, ఇంటెలిజెన్స్ ఓఎస్డీ కమలాసన్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ జితేందర్ రెడ్డి, సమాచార శాఖ అడిష నల్ డైరెక్టర్ డి.ఎస్. జగన్, చీఫ్ ఇంజనీర్ రాధా కిషన్, రీజినల్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ జయ రామమూర్తి, ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్ రాజేశ్వర్ రెడ్డి, డిస్టిక్ట్ ఆఫీసర్ వెంకన్న, ఆర్డీవో రామ కృష్ణ, డీఈఓ యాదయ్య, ఆర్ అండ్ బి, విద్యుత్, వైద్య, జీహెచ్ ఎంసీ, వాటర్‌వర్క్స్,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వివాహేతర సంబంధంతో హత్య

- భార్యను హత్య చేసిన భర్త

నగర్ కర్నూల్,ఆగస్ట్13 : నాగర్ కర్నూలు జిల్లా వెల్దండ మండలం కోట్ర గ్రామానికి చెందిన వివాహిత దారుణ హత్యకు గురైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోట్ర గ్రామానికి చెందిన నారుమళ్ల అనూష(22) కల్వకుర్తి పట్టణంలోని ఓ లేడీస్ కార్నర్‌లో పనిచేస్తోంది. ఆమె భర్త చెన్నయ్య ఓ హోటల్‌లో పనిచేస్తున్నాడు. ఈ దంపతులకు ఓ కుమారుడు ఉన్నాడు. అనూష గ్రామానికి చెందిన రాములు అనే వ్యక్తితో కొన్నేళ్లుగా వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి రాములు.. అనూషను ఒడ్డోనిరాళ్ల వద్దకు తీసుకెళ్లి హత్య చేసి, ఆపై పెట్రోల్ పోసి నిప్పంటించి దహనం చేశాడు. అనంతరం అక్కడి నుంచి పరారైనట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. హత్యకు పాల్పడిన రాములుతోపాటు అతనికి సహకరించిన మరో వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కల్వకుర్తి, వెల్దండ సీఐలు భీమ్‌కుమార్, రఘువీరారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు.

# అప్పు తీర్చనందుకు బాలికను తీసుకెళ్లే యత్నం

### కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసుల కేసు

హైదరాబాద్,ఆగస్ట్13 : హైదరాబాద్‌లో బాకీ తీర్చలేదని రెండేళ్ల బాలికను కిడ్నాప్‌నకు ఓ వ్యక్తి యత్నించాడు. అప్పు తీర్చలేదనే కోపంతో బాలికను తీసుకెళ్లేందుకు ఓ వ్యక్తి ప్రయత్నించాడు. అయితే బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. హనుమాన్ నగర్‌లో అద్దె ఇంట్లో ఈ కుటుంబం నివాసం ఉంటోంది. మానికేశ్వరీ నగర్‌లో నివాసం ఉన్న సమయంలో పరిచయస్తుడి వద్ద రూ.30 వేల అప్పును బాలిక కుటుంబ సభ్యులు తీసుకున్నారు. అప్పు తిరిగి చెల్లించకపోవడంతో బుధవారం ఇంటికి ఆ వ్యక్తి వచ్చాడు. ఈ క్రమంలో డబ్బులు ఇవ్వాలంటూ కుటుంబ సభ్యులతో సదరు వ్యక్తి వాగ్వాదానికి దిగాడు. డబ్బులు ఇచ్చే వరకు మీ కుమార్తెను తీసుకెళ్తానంటూ అతడు బెదిరించాడు. రెండేళ్ల బాలికను తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన వ్యక్తిపై బాధిత కుటుంబం పోలీసులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేసింది. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆ బాలికను తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తున్నారు.

(మొదటిపేజీ తరువాయి)

## సంక్షేమాన్ని రెట్టింపు చేసాం

(మొదటిపేజీ తరువాయి)

వెయ్యి ఆర్టీసీ బస్సులు కొనుగోలు చేసి ఇచ్చాం అని రేవంత్ అన్నారు. ఆనాడు నేను పార్లమెంట్ సభ్యుడిగా పోటీ చేస్తే కూకట్ పల్లి ప్రజలు నన్ను ఆశీర్వదించి గల్లీ నుంచి ఢిల్లీకి పంపారని గుర్తు చేసుకున్నారు. ప్రతిపక్షంలో ఉండగా గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో మీరు ఆశించిన మేరకు అభివృద్ధి చేయలేకపోయానన్నారు. కానీ ఇప్పుడు కూకట్ పల్లిని అభివృద్ధి చేసుకునేందుకు అన్ని రకాల అధికారం ఉందన్నారు. మీకు ఎలాంటి అభివృద్ధి కావాలన్నా అడిగి చేయించుకోండి. కూకట్ పల్లి నియోజకవర్గాన్ని ప్రతీక దృష్టితో అభివృద్ధి చేయాలని శ్రీధర్ బాబు గారిని ఆదేశిస్తున్నానని అన్నారు. పదేళ్ల వారి పరిపాలన రెండేళ్ల మా పాలనను బేరీజు వేసుకోండి. తెలంగాణలో 3 కోట్ల 28 లక్షల మందికి సన్నబియ్యం అందిస్తున్నాం. ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని పెంచేలా ఇందిరమ్మ చీరలను సారెగా అందించాం. పెట్రోల్ బంకులు, సోలార్ ఎ÷-లాంట్లు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాం స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులను విక్రయించుకునేం దుకు శిల్పారామంలో స్టాళ్లను ఇచ్చాం ఒకవైపు గత ప్రభుత్వం చేసిన అప్పులను చెల్లించుకుంటూనే.. మరోవైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం అని సిఎం వివరించారు. డబ్బా ఇండ్లు వద్దు డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామన్న వాళ్లు మీలో ఒక్కరికైనా ఇల్లు ఇచ్చారా అని ప్రశ్నించారు. పట్టణంలో పేదలకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలని మా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ కు శ్రీకారం చుట్టింది. మొదటి విడతలో లక్ష ఇండ్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. మీ సొంతింటి కలను నిజం చేసేందుకు మీ సోదరుడిగా మీకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. తెలంగాణను విధ్వంసం నుంచి వికాసం వైపు తీసుకెళుతున్నాం అని వివరించారు. ఈ సందర్భంగా 22-ఎ భూముల అంశంపై ఆయన మాట్లాడారు. మీరు కొనుగోలు చేసిన భూమి పొరపాటున 22-ఎలో పడితే ఆ భూమిని మీకే ఇప్పిస్తాను. ఈ విషయంలో నాదీ పూచీ. సమస్య ఉన్న ఒక సర్వే నంబర్‌లో 500 ఎకరాలు ఉంటే అన్నీ నిషేధిత జాబితాలో పెట్టారు. సబ్ నంబర్లు ఇచ్చి సమస్యను పరిష్కరిస్తానని సీఎం తెలిపారు.

## పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు

(మొదటిపేజీ తరువాయి)

నేస్తమని మంత్రి గుర్తుచేస్తూ ఈ ప్రభుత్వం తల తాకట్టు పెట్టి అయినా పేదలకు ఇళ్ల నిర్మాణం నిరంతర ప్రక్రియగా చేపడుతుందన్నారు. తొలివిడతగా లక్ష ఇళ్ల నిర్మాణానికి సంకల్పించామని దీనికి సంబంధించి ఇప్పటి వరకు 51వేల దరఖాస్తులు వచ్చాయని, మరో రెండు రోజుల్లో దరఖాస్తులు స్వీకరణ గడువు ముగుస్తుందని అన్నారు. ఆ కార్యక్రమం తర్వాత అందరి సమక్షం లో ఎటువంటి లాలూచీలు లేకుండా పారదర్శకంగా మంత్రులతో సైతం ఎవరి సిఫార్సు లు లేకుండా అందరి ముందు లక్కి డిప్ తీసి ఇళ్లను కేటాయిస్తామని చెప్పారు. లబ్ధిదారులకు ముం దే ఇళ్ల వివరాలను అందిస్తాం కాబట్టి వారు దగ్గరుండి కాంట్రాక్టర్ తో నాణ్యంగా తమ ఇళ్ళను కట్టించుకోవచ్చునని సూచించారు .ఇటువంటి బృహత్తర కార్యక్రమాన్ని గత ప్రభుత్వ పాలకులు జీర్ణించుకోలేక కక్షపూరితంగా గుడ్డ కాల్చి నెత్తిన వేస్తున్నారని విమర్శించారు. ఇప్ప టికే రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల ఇళ్ల గృహప్రవేశాలు పూర్తయ్యాయని గుర్తు చేస్తూ గత ప్రభుత్వం పదేళ్లలో నిర్మించిన ఇళ్ల కంటే మరో రెండున్నర ఇళ్లలో మూడింతలు ఎక్కువగా ఇళ్లు నిర్మిస్తా మని ,అది చేయకపోతే తాను శాసనసభకు పోటీ చేయనని మరోసారి మంత్రి పొంగులేటి ప్రకటించారు. గతంలోనే ఈ ఛాలెంజ్ విసిరినప్పటికీ కిందర్ కింగ్ దీన్ని స్వీకరించలేదని, ఆయన నుంచి ఎటువంటి స్పందన లేదన్నారు. సొల్లు పురాణం సొల్లు కథలు చెబుతూ పేదల ను పేదల ఆత్మగౌరవాన్ని కించపరుస్తున్నారని అన్నారు. ఈ ప్రాంతంలో కొన్ని భూములు నిషే ధిత జాబితాలో ఉన్నట్లు శాసనసభ్యులు తమ దృష్టికి తీసుకువచ్చారని అవి ప్రభుత్వ భూములు కాకపోతే రెండు రోజుల్లోనే ఆ భూములపై నిషేధం తొలగిస్తామని మంత్రి హామీ ఇచ్చారు

# వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలకు అటవీ ఉద్యోగి బలి

- ఘటనపై తీవ్ర చర్యలు తప్పవని అటవీ అధికారి హెచ్చరిక

భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్ట్13 : వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలు తగిలి విధి నిర్వహణలో చెరువుసింగారం వెస్ట్ బీట్ ఆఫీసర్ బానోత్ నవీన్ ప్రాణాలు కోల్పోయారని ఈ ఘటనను అటవీ శాఖ అత్యంత సీరియస్ గా తీసుకుందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అటవీ శాఖ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్ అన్నారు. గురువారం చెరువు సింగారం బీట్ పరిధిలోని నకిరిపేట అటవీప్రాంతాన్ని ఆయన అటవీ అధికారులతో కలిసి పరిశీలిం చారు. అటవీ సిబ్బంది ప్రాణాలను సైతం ప్రమాదంలోకి నెట్టే ఇలాంటి అక్రమ చర్యలను ఎలాంటి పరిస్థితుల్లో నూ ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. ముసలిమడుగు సెక్షన్ పరిధిలో చెరువుసింగారం బీట్ లో సంఘటనా స్థలంలో అణువణువునా పరిశీలించారు. అక్రమ విద్యుత్ ఉచ్చు ఏర్పాటు చేసిన ప్రాంతం, విద్యుత్ సరఫరా జరిగిన విధానం, సంబంధిత విద్యుత్ లైన్లు, అక్రమంగా విద్యుత్ తీసుకున్న మార్గం, పరిసర ప్రాంతాల పరిస్థితులను పరిశీలించారు. ఈ ఘటన కేవలం వన్యప్రాణుల వేటకు సంబంధించిన నేరంగా మాత్రమే కాకు ండా ప్రాణాంతకమైన అక్రమ విద్యుత్ వినియోగం, అటవీ ప్రాంతాల్లో విద్యుత్ భద్రత, ఫీల్డ్ స్థాయి పర్యవేక్షణ, అంతరశాఖల సమన్వయానికి సంబంధించిన అంశంగా పరిగణించారు. అక్రమ విద్యుత్ కనెక్షన్ ఎక్కడి నుంచి తీసుకున్నారు, ఏ విద్యుత్ లైన్ నుంచి సరఫరా జరిగింది, ఎలాంటి విధానంలో విద్యుత్‌ను అటవీ ప్రాంతంలోకి తీసుకువెళ్లారు, అక్రమ కనెక్షన్ ఎంతకాలంగా ఉపయోగిస్తున్నారు. దీనికి సంబంధించి ఫీల్డ్ సిబ్బందికి ఎప్పు డైనా సమాచారం అందిందా, అటవీ ప్రాంతాల్లో విద్యుత్ లైన్లపై అవసరమైన పర్యవేక్షణ తనిఖీలు జరిగాయా అనే కోణంలో సమగ్ర దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందని డీఎఫ్ఓ స్పష్టం చేశారు. ఈ ప్రాంతంలో అక్రమ విద్యుత్ ఉచ్చును ఏర్పాటు చేసిన వ్యక్తులు ఎవరు, వారికి విద్యుత్ సరఫరా ఎలా అందింది, ఈ చర్య వెనుక మరెవరైనా ఉన్నారా అనే కోణంలో వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. నేరానికి పాల్పడిన వ్యక్తులపై వర్తించే అటవీ, వన్యప్రాణి సంరక్షణ, విద్యుత్, ఇతర సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు ఉంటాయన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, విధుల్లోకి అటవీ సిబ్బంది వెళితే ప్రత్యేక చర్యలతో పాటు అప్రమత్తత పాటించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఏదేమైనా విధుల్లో ఎఫ్‌బీఓ మృతి చెందడం చాలా బాధాకరమన్నారు. ఆయన వెంట ఎఫ్ఎవో కృష్ణప్రసాద్, డీఆర్వోలు అనార్కలీ, క్రాంతి, ఎస్ఆర్వో సురేష్, ఎస్ఐ రామ్మూర్తి, విద్యుత్ శాఖ అధికారులు, ముసలిమడుగు సెక్షన్ బీట్ ఆఫీసర్లు ఉన్నారు.

## చేయూత పెన్షన్లకు దరఖాస్తులు స్వీకరించండి

తాండూరు,ఆగస్ట్13 : ఆగస్టు 15 నుంచి 31 వరకు గ్రామాల్లో చేయూత పింఛన్లకు దరఖాస్తులను స్వీకరించాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సూచించారు. తాండూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల స్థాయి సమావేశంలో జడ్పీ సీఈఓ సుధీర్‌తో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈనెల 15వ తేదీ నుంచి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తామన్నారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో అందించే అల్పాహారం, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించాలన్నారు. సర్పంచులు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను 45 రోజుల్లోగా పరిష్కరించాలని ప్రభుత్వ శాఖల అధికారులను ఆదేశించారు.

## తూప్రాన్‌లో పూజారి ఇంట్లో చోరీ

మెదక్,ఆగస్ట్13: మెదక్ జిల్లాలో వరుస చోరీలు ఆందోళన కలిగిస్తున్నాయి. తూప్రాన్‌లో బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కామేశ్.. తూప్రాన్ పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో అద్దెకు నివాసం ఉంటూ నాచగిరి ఆలయంలో పురోహితులుగా పనిచేస్తున్నారు. ఈ నెల 11న కామేష్ దంపతులు హైదరాబాదులో బంధువుల ఇంటికి వెళ్లారు. బుధవారం రాత్రి ఇంటికి తిరిగి వచ్చేసరికి తాళాలు పగలగొట్టి బీరువాలోని వస్తువులన్నీ చిందర వందరగా పడి ఉన్నాయి. బీరువాలో దాచిన రూ.4 లక్షల నగదు, నాలుగు తులాలకుపైగా బంగారు ఆభరణాలు కనిపించడంలేదని బాధితులు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో తూప్రాన్ సీఐ వెంకటరాజా గౌడ్ ఆధ్వర్యంలో క్లూస్ టీంతో సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మనవడి జ్ఞాపకార్థం పాఠశాలలో వంటగది నిర్మాణం

ఖమ్మం,ఆగస్ట్13 : ఇటీవల మరణించిన తమ మనుమడి జ్ఞాపకార్థం తాత- నానమ్మలు పాఠశాలకు వంటగది నిర్మాణం చేపట్టి అందజేసారు. ఈ సంఘటన గురువారం ఖమ్మం రూరల్ మండలంలో చోటుచేసుకుంది. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఎం.వెంకటాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.70 వేల వ్యయంతో వంట గదిని నిర్మించి వితరణగా అందించారు. గ్రామ మాజీ సర్పంచ్ గుర్రం అచ్చయ్య ధనమ్మ మనవడు యడ్లపల్లి సందీప్ ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతి చెందాడు. అతడి జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు పాఠశాలకు వంటగదిని నిర్మించి అందించారు. మాజీ సర్పంచ్ గుర్రం అచ్చయ్య మాట్లాడుతూ.. సందీప్ జ్ఞాపకార్థం విద్యార్థులకు ఉపయోగపడే సేవా కార్యక్రమం చేపట్టడం సంతృప్తినిచ్చిందన్నారు. ప్రతి నెల విద్యార్థులకు వివిధ రకాల అంశాలపై వ్యాసరచన, ఉపన్యాసం, క్విజ్ మొదలగు పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు రూ.1,500 అందించడం జరుగుతుందన్నారు. ప్రధానోపాధ్యాయుడు జి. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా ఇదే పాఠశాలలో పనిచేసి పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయురాలు కృపాభాయి విద్యార్థుల భోజన సౌకర్యం కోసం రూ.25 వేల విలువైన బల్లాలను అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వేగినాటి విజయ్‌కుమార్, ఉప సర్పంచ్ కొల్లపూడి సుమతి ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఆగిన కళ్యాణలక్ష్మి

- పేదింటి పిల్లలకు శాపంగా మారిన కాంగ్రెస్ తీరు
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 13: రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి, సంక్షేమ పథకాల పట్ల అనుసరిస్తున్న దగాకోరు విధానాల వల్లే పేదింటి ఆడపిల్లలకు ఆసరాగా నిలిచే 'కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్' పథకాలపై హైకోర్టు స్టే విధించిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి ఆరోపించారు. ఇది రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతను రుజువు చేసిందని మండిపడ్డారు. పేద వర్గాలకు ఈ పథకాల ఫలాలు అందకూడదనే దుర్బుద్ధితో, నిధులను ఎగ్గొట్టే కుట్రతోనే కాంగ్రెస్ ప్రభుత్వం కావాలని కోర్టు వ్యవహారాల్లో అలసత్వం వహించిందని విమర్శించారు. హైకోర్టులో దాఖలైన పిటిషన్ పై కౌంటర్ దాఖలు చేస్తామని గతంలో అడ్వొకేట్ జనరల్ స్పష్టం చేసినప్పటికీ, న్యాయస్థానం పలుమార్లు అవకాశం ఇచ్చినా ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయకపోవడం బాధ్యతారాహిత్యానికి ప్రత్యక్ష నిదర్శనమని ధ్వజమెత్తారు. గత ఎన్నికల సమయంలో కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్దిదారులకు ఆర్థిక సాయంతో పాటు అదనంగా తులం బంగారం ఇస్తామని రంగుల హామీలు ఇచ్చిందని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తరువాత తులం బంగారం ఇవ్వకపోగా పథకాన్ని కూడా ఎగ్గొట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన ప్రజాదరణ పొందిన పథకాలను పూర్తిగా రూపుమాపే కుట్రలో భాగంగానే ప్రభుత్వం ఇలాంటి నాటకాలకు తెరలేపుతోందని దుయ్యబట్టారు. 2014 నుంచి బీఆర్ఎస్ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ వర్గాలకు రూ. 13 వేల కోట్లకు పైగా వెచ్చించి లక్షలాది మంది ఆడబిడ్డల పెళ్లిళ్లకు కొండంత అండగా నిలిచామని పేర్కొన్నారు. ?ప్రభుత్వం ఇప్పటికైనా నిద్రమత్తును వీడి, వచ్చే విచారణ గడువైన సెప్టెంబరు 9 లోగా ఉన్నత న్యాయస్థానంలో బలమైన కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని డిమాండ్ చేశారు. అవసరమైతే చట్టసభల ద్వారా ప్రత్యేక చట్టబద్ధత కల్పించి స్టే ఎత్తివేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. లబ్దిదారులకు వెంటనే నిధులు విడుదలయ్యే వరకు బీఆర్ఎస్ పార్టీ ప్రజాక్షేత్రంలోనూ, చట్టసభల్లోనూ పోరాడుతుందని హెచ్చరించారు.

## ఖేలో ఇండియా క్రీడల నిర్వహణ

- కేంద్ర క్రీడాశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయతో వాకిటి శ్రీహరి



న్యూఢిల్లీ, ఆగస్టు 13:కేంద్ర యువజన వ్యవహారా లు, క్రీడల శాఖ మంత్రి శ్రీ మన్‌సుఖ్ మాండవీ యను తెలంగాణ క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహ రి గురువారం న్యూఢిల్లీలో కలి శారు. ఆయన తోపాటు తెలంగాణ ప్రభుత్వ క్రీడా వ్యవహారాల సలహాదారు శ్రీ ఏపీ జితేం దర్ రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శ్రీ కె. శివసేన రెడ్డి ఉన్నారు. తెలంగాణకు ఖేలో ఇండియా క్రీడలను కేటాయించినందుకు ప్రధా నమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయకు రాష్ట్ర ప్రభు త్వం తరఫున మంత్రి వాకిటి శ్రీహరి కృతజ్ఞ తలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి రాసిన ఆహ్వాన లేఖను కేంద్ర మంత్రి మాండవీయకు అం దజేశారు. డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు 12 రోజులపాటు తెలంగాణలో ఖేలో ఇండియా క్రీడలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఖేలో ఇండియా క్రీడలను ఘనంగా, విజయ వంతంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేసిందని మంత్రి పేర్కొన్నారు. నిర్వహణలో ఎలాంటి లోపాలు, విమర్శలకు తావులేకుండా అత్యు న్నత ప్రమాణాలతో పోటీలను నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమయం తీసుకుని, ఖేలో ఇం డియా క్రీడల ప్రారంభోత్సవానికి హాజరుకా వాల్సిం దిగా ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి స్వయంగా ఆహ్వానిస్తారని తెలిపారు. తెలంగాణ ప్రభు త్వం నూతన క్రీడా విధానాన్ని తీసుకొచ్చి, విప్ల వాత్మక నిర్ణయాలతో రాష్ట్రంలో క్రీడారంగాన్ని ముందుకు తీసుకెళ్తోందని మంత్రి వాకిటి శ్రీహరి చెప్పారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతు లైన క్రీడాకారులకు ప్రాధాన్యం కల్పిస్తున్నామని తెలిపారు. అందరి సహకారంతో ఖేలో ఇండియా క్రీడలను విజయవంతంగా నిర్వహించి తెలంగాణ ప్రతిష్ఠను మరింత పెంచుతామని పేర్కొన్నారు.

## తెలంగాణను దోచుకోవడంలో బిఆర్ఎస్‌తో పోటీ

- కాంగ్రెస్ తీరుపై మండిపడ్డ ఎంపి రఘునందన్ రావు
- యూనిటీమాల్ ఒప్పందాలపై విచారణ జరగాలని డిమాండ్



న్యూఢిల్లీ, ఆగస్టు 13 : తెలంగాణలో ప్రజల సొమ్ము దోచుకోవడంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పోటీ పడుతున్నాయని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. బీఆర్ఎస్ పదేళ్ల అవినీతిని మించి కాంగ్రెస్ దోచుకోవాలని చూస్తోం దని విమర్శించారు. ఈ రెండు పార్టీలు ఒకే నాణెళినికి ఇరువైపులా ఉన్నటువంటివని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా యూనిటీ మాల్ పేరుతో జరిగిన ఒప్పందంపై సమగ్ర విచారణ జరపాలని ఎంపీ డిమాండ్ చేశారు. కేంద్రం ఇచ్చిన రూ.202 కోట్లతో యూనిటీ మాల్ నిర్మించాలని నిర్ణయించారని ఎంపీ రఘునందర్ రావు అన్నారు. అందుకు తెలంగాణ ప్రభుత్వం ఆరు ఎకరాలకు పైగా భూమి ఇచ్చిందన్నారు. అయితే, ఈ ఒప్పం దంలో అవినీతి జరిగిందన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన ఆరోపణలపై విచారణ జరగాలని ఎంపీ రఘునందన్ రావు స్పష్టం చేశా రు.కాంగ్రెస్, బీఆర్ఎస్ పరస్పరం ఆరోపణలు చేసు కుంటూ ప్రజల దృష్టిని మళ్లిస్తున్నాయని రఘు నందన్ రావు విమర్శించారు. వీళ్లిద్దరూ అవినీతిలో అన్నదమ్ములంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఈ సందర్భంగా తెలంగాణలో డబుల్ ఇంజిన్ ప్రభు త్వం రావాలని ప్రజలకు బీజేపీ విజ్ఞప్తి చేస్తోంద న్నారు. హైదరాబాద్‌లో భూముల విలువ ఎకరాకు వందల కోట్లకు చేరిందని, ప్రజల ఆస్తులను విక్రయించే హక్కు ప్రభుత్వాలకు లేదని ఎంపీ తేల్చి చెప్పారు. ప్రజల ఆస్తులకు ప్రభుత్వాలు కస్టోడియ న్లుగా ఉండాలని, అంతేకానీ యజమానులుగా వ్యవహరించొద్దని ఆయన పేర్కొన్నారు. కేటీఆర్ తప్పు చేస్తే విచారణ జరిగినప్పుడు, కాంగ్రెస్ తప్పు చేస్తే విచారణ ఎందుకు ఉండకూడదని ప్రశ్నించారు. 2018లో బీఆర్ఎస్ హయాంలో 10 ఎకరాల భూమిని ప్రైవేట్ సంస్థకు కేటాయించారని, దానిపైనా విచారణ జరగాలన్నారు. ఈ రెండు భూకేటాయింపు ఒప్పందాలపై సమదృష్టితో దర్యాప్తు జరపాలని రఘునందన్ డిమాండ్ చేశారు. యూనిటీ మాల్, గత బీఆర్ఎస్ భూకేటాయిం పుల పై కేంద్ర దర్యాప్తు సంస్థలతో విచారణ కోరుతూ కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు ఎంపీ చెప్పుకొచ్చారు. అలాగే, కాళేశ్వరం ప్రాజెక్టుపై డీపీఆర్ నుంచి చివరి చెల్లింపు వరకు సీబీఐ విచారణ జరపాలన్నారు. కేవలం మూడు బ్యారేజీలపై కాకుండా మొత్తం ప్రాజెక్టుపై దర్యాప్తు చేయాలన్నారు. కాళేశ్వరం మొత్తం ప్రాజెక్టుపై విచారణ జరిపించాలని కేంద్రానికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాయాలని ఎంపీ సూచించారు. దానిపై కేంద్ర హోంమంత్రిని కలిసి దర్యాప్తు జరిగేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. మరోవైపు, రింగ్ రోడ్డు, ఫార్ములా-ఈ రేస్, కాళేశ్వరం అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం మాట మార్చిందని ఎంపీ మండిపడ్డారు.

## టెస్సరాక్ట్ సంస్థకు భూకేటాయింపులపై రాజకీయం

- భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మండిపాటు



న్యూఢిల్లీ,ఆగస్ట్13 : టెస్సరాక్ట్ సంస్థకు కేటాయించిన భూములపై బీఆర్ఎస్ రాజకీయం చేస్తోందని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. దిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ ఎంపీలతో కలిసి ఆయన మాట్లాడారు. 'ఎలక్ట్రానిక్ మాన్యుఫ్యాక్చరింగ్ క్లస్టర్‌లో బీఆర్ఎస్ హయాంలో 54 కంపెనీలకు భూ కేటాయింపులు జరిగాయి. వారి హయాంలో ఎకరాకు రూ.30లక్షల నుంచి రూ.80లక్షల చొప్పున ఇచ్చారు. మా ప్రభుత్వం వచ్చాక 8 కంపెనీలకు భూ కేటాయింపులు జరిగాయి. ఎకరా రూ.1.50 కోట్లకు కేటాయించాం. 5 ఎకరాలు కావాలని టెస్సరాక్ట్ సంస్థ 2024లో దరఖాస్తు చేసుకుంది. ఏడాదిపాటు పరిశీలించి ఆ సంస్థకు 2025లో భూమిని కేటాయించాం. అందరికీ కేటాయించినట్టుగానే ఆ సంస్థకు కూడా ఎకరా రూ.1.50 కోట్ల చొప్పున ఇచ్చాం. 2025 వరకు టెస్సరాక్ట్ సంస్థకు కొండల్‌రెడ్డి డైరెక్టర్, మేనేజింగ్ డైరెక్టర్ కాదని ఎంపీ చామల వివరించారు.

## చంద్రగిరిలో ఏనుగుల హల్‌చల్

### పంటపొలాలను ధ్వంసం చేసినట్లు రైతుల వెల్లడి

తిరుపతి,ఆగస్ట్13 : జిల్లాలోని చంద్రగిరి మండలం యల్లంపల్లిలో మరోసారి ఏనుగుల గుంపు బీభత్సం సృష్టించింది. అర్ధరాత్రి గ్రామ పరిసరాల్లోకి సుమారు 15 ఏనుగులు చొరబడి పంట పొలాలపై దాడి చేశాయి. వరి పంటతో పాటు పశువుల కోసం సాగు చేసిన గడ్డి పంటలను తొక్కి ధ్వంసం చేశాయి. రైతులకు చెందిన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. రాత్రివేళ ఏనుగుల గుంపు ఒక్కసారిగా పంట పొలాల్లోకి రావడంతో రైతులు, గ్రామస్తులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. పంటలు చేతికొచ్చే సమయంలో ఏనుగుల దాడితో నష్టం వాటిల్లడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏనుగుల గుంపు మళ్లీ గ్రామ పరిసరాల్లో సంచరిస్తుండటంతో యల్లంపల్లి ప్రజ ల్లో భయాందోళనలు నెలకొన్నాయి. ఏనుగులు ఎప్పుడు, ఎటువైపు నుంచి వస్తాయో తెలియక రైతులు రాత్రివేళ పొలాల వద్దకు వెళ్లేం దుకు సైతం భయపడుతున్నారు. పంట నష్టానికి పరిహారం అందిం చడంతో పాటు ఏనుగులు గ్రామాల వైపు రాకుండా చర్యలు తీసుకో వాలని అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు. గ్రామస్తుల సమాచారంతో అటవీ అధికారులు రంగంలోకి దిగి ఏనుగుల కదలికలను పరిశీలిస్తు న్నారు. ఏనుగుల గుంపును సురక్షితంగా అటవీ ప్రాంతం వైపు తరలించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.

## ఇసిఐ పేరుతో ఫేక్ మెసేజ్‌లు

### అప్రమత్తంగా ఉండాలన్న సిఇవో

హైదరాబాద్, ఆగస్టు 13: ఈసీఐ పేరుతో ఓటర్లకు మోసపూరిత సందేశాలను సైబర్ మోసగాళ్లు పంపిస్తున్నారని తెలంగాణ చీఫ్ ఎల క్టోరల్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. ఓటర్ వివరాలు సరిపో లడం లేదంటూ ఫేక్ మెసేజ్‌లు వస్తున్నాయని.. వీటిపై జాగ్రత్తగా ఉం డాలని సూచించారు. దరఖాస్తు తిరస్కరణ పేరుతో రూ.5లు చెల్లిం చాలని డిమాండ్ చేస్తున్నారని అన్నారు. వాట్సాప్ లింక్ ద్వారా దర ఖాస్తు నింపాలని కోరుతున్నారని తెలిపారు. బ్యాంక్ వివరాలు, పాస్ వర్డ్, లను సైబర్ నేరగాళ్లు అడుగుతున్నారని సీఈవో తెలిపారు. ఇలాంటి మెసేజ్‌లు ఇఅఎ, తెలంగాణ అఇక్ష కార్యాలయం నుంచి రావని స్పష్టం చేశారు. ఫేక్ కాల్స్, మెసేజ్‌లకు స్పందించొద్దని సూచించారు. మోసపూరిత సందేశాలు వస్తే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సీఈవో సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు.

## కళ్యాణ లక్ష్మిపై కుట్రలు అడ్డుకోండి : ఆర్ఎస్

హైదరాబాద్,ఆగస్ట్13 : కళ్యాణ లక్ష్మి పథకం ఆపడానికి కుట్ర జరుగుతుంటే నెల రోజులు కోర్టు టైం ఇచ్చినా ప్రభుత్వం ఎందుకు కౌంటర్ వేయలేదని బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పుడు కొత్తగా విజయ్ గోపాల్ అనే కార్యకర్త, అడ్వకేట్ హైకోర్టులో ప్రజా ప్రయోజనాల వ్యా జ్యం జులై 8న వేసాడని అన్నారు. విజయ్ గోపాల్ అనే అడ్వకేట్ ఇది రాజ్యాంగ విరుద్ధం. ఈ రాజ్యాంగంలో ఉండే అధికరణలకు విరుద్ధం గా ఉన్నది. మరి సామాజిక న్యాయానికి, సమానత్వానికి విరుద్ధంగా ఉందని ఆయన అంటున్నడు. జీవోల ప్రకారం సంక్షేమ పథకాలు నడపడం కాదు.. దీనికి చట్టబద్ధత ఉండాలని ఆయన అంటున్నాడు. జూలై 8వ తేదీ నుంచి 4 సార్లు విచారణ వాయిదా పడినా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు కౌంటర్ దాఖలు చేయలేదని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రశ్నించారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌లకు నోడల్ ఏజెన్సీ పొన్నం ప్రభాకర్.. ఆయన మేము మాట్లాడితే మమ్మల్ని తాడు బొంగరం లేనోళ్లు అని అంటాడు. ఇప్పుడు పొన్నం ప్రభాకర్ మాటలకు, ఇతర సంక్షేమ శాఖ మంత్రుల మాటలకు తాడు బొంగరం ఉందా..? అని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అడిగారు.

## అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌కు మద్దతు

- ప్రభుత్వ మద్దతు లేకుంటే పనులు జరగవు
- మాజీ స్పీకర్ పోచారం మరోమారు హాట్ కామెంట్స్

కామారెడ్డి,ఆగస్ట్13 : అభివృద్ధి కోసమే ముఖ్యమంత్రి రేవంత్‌కి మద్దతు ఇచ్చానని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. అన్నం పెట్టిన వాళ్లను మరిచిపోతే పుట్టగతులుండవన్నారు. కేసీఆర్ చేశారు కాబట్టే.. చేశారని చెప్పానని.. రేవంత్ రెడ్డి ఇచ్చినవి కూడా చెబుతా నని తెలిపారు. ఉన్నది ఉన్నట్లు చెప్పడం తన నైజమని చెప్పుకొ చ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర దుమా రాన్ని రేపిన విషయం తెలిసిందే. అభివృద్ధి నిధులకు సంబంధించి తనకు న్యాయం జరగలేదంటూ కామెంట్స్ చేశారు. దానికి కొనసా గింపుగా గురువారం కూడా వర్ని మండలం జాకోరా గ్రామంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే... మరోసారి హాట్ కామెంట్స్ చేశారు. ఇటీవల తాను చేసిన వ్యాఖ్యల్లో ఎలాంటి రాజకీయం దురుద్దేశం లేదని స్పష్టం చేశారు. తనకు స్వార్థం ఉందంటూ బుద్ధిహీనులు ప్రచారం చేస్తున్నారని, స్వార్థం ఉందని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. 'నా మాటల వెనుక రాజకీయం, రహస్యం లేదు. నేను డబ్బులకు అమ్ముడుపోయే వ్యక్తిని కాదు. నాకు ఎలాంటి స్వార్థం లేదు.

బలగం TV BALAGAM
balagamtv100@gmail.com

# సంపాదకీయం

## పార్లమెంట్‌ను అపవిత్రం చేశారు !

తిలా పాపం తలా పిడికెడు అన్నట్లుగా.....పార్లమెంటు సమావేశాలు మట్టి కరవడానికి అందరూ బాధ్యులే. 19 రోజుల పాటు ఎవరికి వారే అన్న ట్లుగా వ్యవహరించి ఎన్నుకున్న ప్రజలను అవామానానికి గురి చేశారు. ప్రజలు ఎంతో నమ్మకంతో వీరిని ఎన్నుకుని పంపితే చట్టసభలను చట్టు బండలు చేస్తున్నారు. సమస్యలను చర్చించకుండా..వ్యక్తిగత ఎజెండాలతో భ్రష్టు పట్టించారు. ఇలాంటి నేతలు ప్రజల సమస్యలు పరిష్కరిస్తా రని, వారి ఆశలను పరిశీలిస్తారని అనుకోవడం బుద్ధితక్కువ తప్ప మరోటి కాదు. చట్టసభల్లో సమస్యలు చర్చించాలి. సమస్యలకు సమాధానాలు రాబట్టాలి. చట్టాలను చేయాలి. కానీ ఇవేవీ జరగకుండా విపక్షాలు అడ్డు కుంటే..అధికార పక్షం చోద్యం చూసింది. దొందూ దొందే అన్నచందంగా సమావేశాలు సాగకుండా 19 రోజుల పాటు నానా రభస సృష్టించారు. చివరి రోజు గురువారం కూడా సభలు సజావుగా సాగక పోవడంతో ఉభయ సభలను నిరవధికంగా వాయిదా వేశారు. మొత్తంగా ఈ 19 రోజులు ప్రతిపక్ష సభ్యుల ఆందోళనల మధ్య ఎటువంటి కార్యకలాపాలు జరగకుండానే వాయిదాపడ్డాయి. దీంతో పార్లమెంటు సమావేశాలు మొదలైన జులై 20 నుంచి ఇప్పటిదాకా 19 రోజులు సభా కార్యకలాపాలు తుడిచిపెట్టుకుపోయాయి. అధికార, ప్రతిపక్షాలు పట్టు వీడకపోవడంతో ఆఖరి రోజూ సజావుగా సాగలేదు. విద్యార్థుల ఆందోళనపై చర్చకు సిద్ధమని బుధవారం కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సవాల్ విసిరారు. చర్చకు ప్రతిపక్షం అంగీకరిస్తే పార్లమెంటు సమావేశా లను పొడిగించడానికీ సిద్ధమని కేంద్రం తెలిపింది. అయితే ఆయన లెక్చర్ వినడానికి సిద్ధంగా లేమని ప్రతిపక్షం ఆ సవాల్‌ను తోసిపుచ్చింది. బుధవారం ఉదయం 11గంటలకు లోక్‌సభ సమావేశం కాగానే ప్రతిపక్ష సభ్యులు వెల్‌లోకి వచ్చి నినాదాలు చేశారు. చర్చను ప్రారంభిద్దామని మంత్రి కిరణ్ రిజిజు ప్రతిపాదించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో సభ నిరవధికంగా వాయిదా పడింది. ప్రభుత్వం చర్చకు సిద్ధంగా ఉంటే ప్రతిపక్షం పారిపోవడం తొలిసారిగా చూస్తున్నా' అని పార్లమెంటరీ వ్యవ హారా మంత్రి కిరణ్ రిజిజు వ్యాఖ్యానించారు. నిజయోకవర్గ సమస్యలను ఎలాగూ ప ట్టించుకోవడం లేదు. అలాగే దేశ సమస్యలపైనా బాధ్యత లేదు. ప్రతిపక్షం బలంగా గళం వినిపిస్తేనే ప్రభుత్వాలు తలవంచుతాయి. ఆందోళన చేయడం కూడా ఓ రకమైన నిరసన అని చెప్పుకుని తప్పిం చుకోవడం మినహా విపక్షం చేసిందేమీ లేదు. పార్లమెంట్ లోపాలా, బయటా ధర్నాలు చేయడం మినహా సాధించిందేమీ లేదు. దీనికోసం ప్రజలు ఎంపిలను ఎన్నుకోలేదు. విద్యార్థుల ఆందోళనలపై ప్రభుత్వం చర్చకు సిద్ధమని చెప్పడం.. అమిత్ షా ప్రతిష్ఠ అనే గాలి బుడగ పేలిపో యాక దానిలో గాలిని నింపడానికి చేసిన చివరి ప్రయత్నంగా రాహుల్ అభివర్ణించారు. అసలు తమపై పెల్లెట్ గన్‌లతో కాల్పులు జరపడానికి ఎవరు ఆదేశించారో తెలుసుకోవాలని యువత కోరుకుంటున్నారని రా హుల్ పట్టుపడుతూ వచ్చారు. అమిత్ షా ఉపన్యాసం వినడానికి సిద్ధంగా లేమని తేల్చి చెప్పారు. విద్యార్థుల ఆందోళనలు, వాటికి సంబంధించిన అంశాలపై చర్చకు సిద్ధంగా ఉన్నానని అమిత్ షా తెలిపారు. ప్రతిపక్షాలు చర్చను కోరుతూ లోక్‌సభ స్పీకరుకు లేఖ ఇవ్వాలని, వారు అడిగే అన్ని ప్రశ్నలకు సమాధానాలు ఇస్తానని ఆయన స్పష్టం చేశారు. మొత్తం చర్చలో తాను పాల్గొంటానని తేల్చి చెప్పారు. చర్చ నుంచి తాను పారిపోతున్నా నన్న ప్రతిపక్షాల ఆరోపణలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన స్పీకర్‌కు లేఖ రాశారు. ప్రతిపక్షాలతో సంప్రదించి విద్యార్థుల ఆందోళనలపై చర్చ చేపట్టాలని కోరారు. కానీ విపక్షం చర్చకు సిద్దంగా లేదని తేలిపోయింది. కేవలం బలప్రదర్శన వేదికగా వర్షాకాల సమావేశాలు నిలిచాయి. విపక్షాలు బలంగా ఉన్నాయని చాటి చెప్పడానికి ప్రయత్నించారు. ప్రధానంగా విదేశీ విరాళాల సవరణ బిల్లును అడ్డుకోవడం కోసం చేసిన ప్రయత్నం ఫలించింది. ప్రజలు ఇప్పుడు ఆలోచించాల్సిన సమయం వచ్చింది. ఉభయ సభలు ఈ వర్షాకాల సమావేశాల్లో సజావుగా జరగకూడదన్న విపక్షం ఎజెండా విజయం సాధించింది. పార్లమెంటులో విపక్షాల నినాదాలు, పోడియంలోకి దూసు కుని రావడం, స్పీకర్ ఓంబిర్లా వారించడం నిత్యకృత్యంగా మారాయి. దీంతో సమావేశాలను విపక్ష పార్టీలు కావాలనే స్తంభింపచేసాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే అధికార పార్టీ సభ్యులు కూడా ఈ సమావేశాల్లో మకరద్వారం వద్ద ప్రతిపక్షాలను నిలదీస్తూ 'రాహుల్ గాంధీ జవాబ్ దో..' అని నినాదాలు చేశారు. అయితే ఇవేవీ ప్రజలకు ఉపయోగపడే వ్యవహారాలు కావు. అటు అధికార పార్టీ, ఇటు విపక్ష పార్టీలు రెండూ బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నాయనడంలో ఎలాంటి సంకోచం అవసరం లేదు. నినాదాలు చేస్తున్న పాలక, ప్రతిపక్ష సభ్యుల తీరును ప్రజలు గమనించారు. ఎవరేంటో తెలుసుకుంటున్నారు. వీరి తీరుపైనా జెన్‌జీలు దృష్టి సారించాలి. బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న నాయకులను కనిపెట్టాలి. లేకుంటే పార్లమెంట్ సమావేశాలకు అర్థం లేకుండా పోతుంది. ఇలా 19 రోజులు సభలను వృధా చేసినందుకు నేతల జీతభత్యాలను కట్ చేయాలి. వారికి తగిన ఫైన్ వేయాలి. అప్పుడే నేతల్లో జవాబుదారీతనం వస్తుంది.

# వేలం వెర్రిగా భూముల అమ్మకం

- ప్రభుత్వ భూముల జాడలేకుండా మాయం
- రాయదుర్గం భూ వేలాన్ని వెంటనే ఆపాలి
- సిఎం రేవంత్‌కు హరీష్ రావు లేఖ



హైదరాబాద్,ఆగస్ట్13 : రాష్ట్రంలో ఎక్కడ పడితే అక్కడ భూముల అమ్మకాలు చేస్తున్నారంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బీఆర్ ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు తీవ్ర స్థాయిలో విరుచు కుపడ్డారు. భూముల అమ్మకాలపై ప్రశ్నలు సంధిస్తూ సీఎంకు హరీశ్ లేఖ రాశారు. 'ఎక్కడ ప్రభుత్వ భూములు కనిపిస్తే అక్కడ అమ్మకాలేనా? నాడు ప్రభుత్వ భూములు పెద్దలు ఇచ్చిన జాతి సంపద అని ఉపన్యాసాలు దంచిన నువ్వు.. నేడు ఎక్కడ భూములు కనిపిస్తే అక్కడ వేలం వేస్తూ, ప్రజల ఆస్తులను అమ్మ కానికి పెడుతున్నావు' అంటూ ఫైర్ అయ్యారు. కంచ గచ్చిబౌలి, లగచర్ల, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ నేడు రాయదుర్గ్ ఇలా ఎక్కడిక్కడ భూములు అమ్మే కుట్రలు చేస్తుండటం సిగ్గుచేటని మాజీ మంత్రి మండిపడ్డారు. రాయదుర్గ్ పన్మక్త గ్రామంలోని సర్వే నం.83/1లో 10.63 ఎకరాల హెరిటేజ్ భూమిని ఆగస్టు 17, 21 తేదీల్లో వేలం వేయడానికి సిద్ధం కావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. 2020లో ఇదే భూములపై రక్షణ కోరుతూ రేవంత్ కోర్టు మెట్లు ఎక్కారని గుర్తుచేశారు. ప్రతిపక్షంలో ఒక మాట.. అధికారంలోకి వచ్చిన తర్వాత మరో మాటనా అని ప్రశ్నించారు. హెరిటేజ్ భూములను కాపాడాల్సిన ప్రభుత్వం.. వాటినే వేలం వేసి అమ్మేందుకు ఎందుకు తొందరపడుతోందని నిలదీశారు. ఇదే సర్వే నంబర్‌లో గతంలో 6.2 ఎకరాలు సుమారు ఎకరాకు 237 కోట్ల చొప్పున వేలం వేస్తే, ఎస్‌బీఐ కోర్టుకు ఎక్కిందని... ప్రస్తుతం ఈ అంశం హైకోర్టు పరిధిలో ఉందని వెల్లడించారు. అయినా, అదే సర్వే నంబర్‌లో మరో 10.63 ఎకరాలను వేలం వేయడం వెనుక ఆంతర్యం ఏమిటని.. న్యాయ వ్యవస్థ అంటే గౌరవం లేదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ భూమిపై అనేక వివాదాలు ఉన్నా యని.. భూమి ఎవరిదో తేల్చకుండా వేలం వేయడం ఎందుక న్నారు. భూమి ఎవరిదో తేల్చలేని ప్రభుత్వం.. భూమిని అమ్మడా నికి మాత్రం ఎందుకు తొందరపడుతోందని అడిగారు. రూ.2,000 కోట్ల విలువైన హెరిటేజ్ భూములను అమ్మే హక్కు కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారంటూ మండిపడ్డారు. నాడు పీసీసీ అధ్యక్షుడిగా ప్రభుత్వ భూములను తెలంగాణ జాతి సంపదగా అభివర్ణించిన రేవంత్ రెడ్డి.. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చారని..' ఇంచు ప్రభుత్వ భూమిని కూడా అమ్మబోము' అన్న హామీ ఏమైందని నిలదీశారు. అసెంబ్లీ సాక్షిగా ప్రభుత్వ భూములను అమ్మబోమని చెప్పిన రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాటలకు విలువ లేదా అని అన్నారు. భూముల వేలంపై రేవంత్ రెడ్డి వైఖరి చూస్తుంటే ఊసరవెల్లి కూడా సిగ్గుపడే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. సుప్రీంకోర్టు కూడా ఆస్తిని పరిరక్షించడం, కొత్తగా ఆస్తి సృష్టించకుండా చూడాల్సిన అవసరాన్ని స్పష్టం చేసిందని హరీశ్ గుర్తుచేశారు. అలాంటి పరిస్థితుల్లో వివాదాస్పద భూమిని వేలం వేసి కొత్త హక్కులు సృష్టించడం ఏ విధమైన పరిపాలనా బాధ్యత అని ప్రశ్నించారు. ఆగస్టు 17, 21 తేదీల్లో జరగనున్న వేలాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అలాగే సర్వే నం.83కు సంబంధించిన హెరిటేజ్, రెవెన్యూ, సర్వే, వక్ఫ్ రికా ర్డులన్నింటినీ బయటకు తీసి సమగ్రంగా విచారణ జరిపి, వాస్త వాలు నిగ్గు తేల్చాలన్నారు. హక్కులు, వివాదాలు తేలకముందే ఈ భూములను కొనుగోలు చేస్తే.. భవిష్యత్తులో న్యాయపరమైన సమస్యలు తప్పవని హెచ్చరించారు. భవిష్యత్ తరాలకు అందిం చాల్సిన విలువైన హెరిటేజ్ భూములను అమ్మాలని చూడటం దారుణమని మాజీ మంత్రి అన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారిలా కాకుండా.. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వ్యవహరించాలని హితవు పలికారు. అనుముల బ్రదర్స్ ప్రయో జనాల కోసం కాదని.. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, తెలంగాణ ప్రయోజనాలను కాపాడే ముఖ్యమంత్రిగా ఉండాలని... లేదంటే చరిత్ర హీనుడిగా మిగిలిపోతారని హరీశ్ రావు లేఖలో పేర్కొన్నారు.

# ఢిల్లీ పేలుళ్ల వెనుక అల్‌ఖైదా అనుబంధ సంస్థ






### ఐక్యరాజ్యసమితి నివేదిక వెల్లడి

న్యూఢిల్లీ,ఆగస్ట్13 : ఢిల్లీ పేలుళ్ల వెనుక అల్ ఖైదా అనుబంధ ఉగ్రవాద సంస్థ అల్‌ఖైదా ఇన్ ఇండియన్ సబ్‌కాంటినెంట్ కుట్ర ఉందని ఐక్య రాజ్యసమితి నివేదిక వెల్లడించినట్లు సమా చారం. 2025 నవంబర్‌లో ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు ఘటనపై దర్యాప్తు నేపథ్యంలో ఈ అంశాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఆల్‌ఖైదా ప్రాంతీయ కార్యకలాపాలను విస్తరిస్తున్న ఉగ్ర వాద సంస్థగా నివేదిక పేర్కొన్నట్లు తెలుస్తోంది. తాలిబన్ల నుంచి మద్దతు, ఆశ్రయం లభి స్తున్నట్లు ఐక్యరాజ్య సమితి నివేదికలో ప్రస్తావిం చినట్లు సమాచారం. దీంతో పలు ప్రాంతాల్లో అల్‌ఖైదా నెట్‌వర్క్ మరోసారి బలపడుతున్న దనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్య ంగా భారత్ సహా ఆయా దేశాల్లో ఉగ్రవాద కార్యకలాపాలకు అల్‌ఖైదా ముప్పుగా మారే అవ కాశం ఉందని భద్రతా వర్గాలు భావిస్తు న్నాయి. 2025 నవంబర్‌లో ఎర్రకోట సమీ పంలో జరిగిన కారు బాంబు పేలుడు ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘ టనకు సంబంధించిన కుట్ర, ఉగ్రవాద నెట్‌వర్క్‌పై దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి నివేదికలోని అంశాలు కీలకంగా మారాయి.

అల్‌ఖైదా తన కార్యకలా పాలను విస్తరించేందుకు ప్రాంతీయ నెట్‌వర్క్ లను ఉపయోగించుకునే ప్రయత్నం చేస్తోందని నివేదికలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. తాలిబన్ల మద్దతుతో పలు ప్రాంతాల్లో సురక్షిత స్థావరాలు లభిస్తున్నాయనే ఆరోపణలు కూడా ఈ నివేదికతో మరోసారి చర్చకు వచ్చాయి. ఉగ్రవాద సంస్థల కదలికలను నిశితంగా పర్యవేక్షించాల్సిన అవసరాన్ని ఈ పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. ఢిల్లీ పేలుళ్ల కేసులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే కొద్దీ ఈ అంతర్జాతీయ ఉగ్రవాద నెట్‌వర్క్‌పై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# జైలులో మాజీ ఎంపి రేవణ్ణ విలాసాలు

- సెల్‌ఫోన్‌తో పాటు, పెన్ డ్రైవ్ పట్టుకున్న అధికారులు

బెంగళూరు,ఆగస్ట్12 : అత్యాచారం కేసులో దోషిగా తేలి జైలు శిక్ష అనుభవిస్తున్న మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ వద్ద సెల్ ఫోన్‌తోపాటు పెన్ డ్రైవ్ లభ్యమైనాయని సెంట్రల్ క్రైమ్ అధికారులు వెల్లడించారు. అతడి వద్ద నుంచి నీలి రంగు ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్, పెన్ డ్రైవ్, ఛార్జర్‌తోపాటు డైరీని స్వాధీనం చేసుకున్నామని వివరించారు. బెంగళూరులోని పరప్పరన అగ్రహారం సెంట్రల్ జైలులో తమ బృందం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించిందని చెప్పారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ అధికారులు తెలిపారు. మరో వైపు ఈ వ్యవహారంపై ప్రభుత్వం సీరియస్ అయింది. రేవణ్ణకు ఆ వస్తువులు ఎలా అందాయనే అంశంపై పూర్తి విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. జైలు అధికారులపై ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా జైలు అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఈరన్న రంగాపూర్‌పై సస్పెన్షన్ వేటు వేసింది. జైలులో లోపాలపై వివరణ ఇవ్వాలంటూ జైలు సూపరింటెండెంట్ అనుష్క కుమార్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసింది. సెంట్రల్ జైలులో దాదాపు ఐదు గంటల పాటు సోదాలు జరిగాయని జైళ్ల శాఖ డీజీపీ అలోక్ కుమార్ తెలిపారు. ఈ తనిఖీల్లో ప్రతాప్ రాయ్ అనే మరో ఖైదీ వద్ద కూడా మొబైల్ ఫోన్ లభ్యమైందని అన్నారు. 019లో హాసన్ ఎంపీ, జేడీ (ఎస్) నేత ప్రజ్వల్ రేవణ్ణ తనపై లైంగిక దాడికి పాల్పడ్డారంటూ హోలినరసిపుర రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఓ మహిళ ఫిర్యాదు చేసింది. ఈ వ్యవహారంలో విచారణ జరిపిన బెంగళూరులోని ప్రత్యేక కోర్టు అతడిని దోషిగా తేల్చింది. అతడికి జీవిత ఖైదు విధించింది. అలాగే రూ. 10 లక్షల జరిమానా విధించింది. 2025, ఆగస్టు 2వ తేదీన కోర్టు ఈ మేరకు తీర్పు వెలువరిం చింది. తనపై అతడు అత్యాచారం చేయడమే కాకుండా.. వీడియో కూడా తీశారంటూ బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

# తిరుమలకు వచ్చే విదేశీ భక్తులకు ప్రభుత్వం శుభవార్త

- రేణిగుంట విమానాశ్రయంలో ఈ వీసా సేవలు

తిరుపతి,ఆగస్ట్12 : తిరుమలలో కొలువుదీరిన కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామి వారి దర్శనం కోసం వచ్చే విదేశీ భక్తులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. తిరుపతి సమీపంలోని రేణిగుంట విమానాశ్రయంలో ఈ - వీసా సేవలు అందుబాటులోకి తీసుకు రావాలని ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. గతంలో తిరుమలలో శ్రీవారి దర్శనం కోసం విదేశీ భక్తులు రావాలంటే.. ముందుగా చెన్నై, బెంగళూరు లేదా హైదరాబాద్ చేరుకోవాల్సి వచ్చేది. అక్కడ ఈ -వీసా పక్రియ పూర్తి చేసుకుని ఆ తర్వాత శ్రీవారి దర్శనం కోసం తిరుపతికి చేరుకునే వారు. ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో తిరుపతి విమానాశ్ర యంలో ఈ వీసా సేవలు అందుబాటులోకి రానున్నాయి. దీంతో ఇకపై ప్రయాణికులు విదేశాల నుంచి నేరుగా తిరుపతి విమానాశ్రయం చేరుకొని ఈ - వీసా పక్రియ ముగించుకునే అవకాశం ఉంటుంది. ప్రయాణానికి కనీసం పది రోజులు ముందే ఆన్‌లైన్‌లో ఈ - వీసాను ప్రయాణికులు అందుకోవాల్సి ఉంటుంది. యితే తిరుపతి విమానాశ్రయంలో అంతర్జాతీయ సర్వీసులు లేనప్పటికీ ముందస్తుగానే ఈ - వీసా కౌంటరును కేంద్ర పౌర విమానయాన శాఖ మంజూరు చేసింది. త్వరలోనే ఈ విమానాశ్రయం నుంచి ఇంటర్నేషనల్ సర్వీసులు ప్రారంభించే అవకాశం ఉందని సమాచారం.

# ఆదర్శంగా నిలిచిన రాజ్యసభ ఎంపి విజయ్

### తొలి వేతనాన్ని ఆర్మీ జవాన్ల సంక్షేమానికి అందచేత



న్యూఢిల్లీ,ఆగస్ట్13 : రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్ గొప్ప మనసును చాటుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారు. అమరులైన ఆర్మీ జవాన్ల కుటుంబాలకు ఎంపీ అండగా నిలిచారు. ఎంపీగా తనకొచ్చిన మొదటి నెల జీతం మూడు లక్షల రూపాయలను దేశ రక్షణ కోసం ప్రాణా లర్పించిన అమరవీరులైన ఆర్మీ జవాన్ల కుటుంబాల సంక్షేమం కోసం విరాళంగా అందించారు. ఈ విరాళం చెక్కును భారత కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు విజయ్ స్వయంగా అందజే శారు.దేశం కోసం అహర్నిశలు శ్రమిస్తూ, ప్రాణ త్యాగాలు చేసిన సైనికుల కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని.. అందులో భాగంగానే ఈ చిరు సాయం చేసినట్లు విజయ్ స్పష్టం చేశారు. పదవి చేపట్టిన వెంటనే తొలి వేతనాన్ని సైనికుల కుటుంబాల కోసం వెచ్చించడం పట్ల విజయ్‌ను పలువురు ప్రశంసిస్తున్నారు.

# లష్కరే చీఫ్ హాఫీజ్ సయీద్‌కు పాక్ అండ

- పాక్‌వైపు కన్నెత్తితో భారత్ సర్వనాశనం తప్పదు
- అవామీ ముస్లిం లీగ్ నాయకుడు షేక్ రషీద్ అహ్మద్ ప్రేలాపన

న్యూఢిల్లీ,ఆగస్ట్13 : పంద్రాగస్టు వేడుకలను రెండు రోజుల్లో భారత్ జరుపుకోనుంది. అలాంటి వేళ.. నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కర్ ఎ తైబా చీఫ్‌పై పాకిస్థాన్ మాజీ మంత్రి, అవామీ ముస్లిం లీగ్ నాయకుడు షేక్ రషీద్ అహ్మద్ ప్రశంసల వర్షం కురిపించారు. అలాగే భారత్‌పై తీవ్ర వ్యా ఖ్యలు చేశారు. లష్కర్ ఎ తైబా చీఫ్ హాఫీజ్ సయీద్‌కు తాను సేవకుడిని ఆయన ప్రకటించారు. హాఫీజ్ సయీద్ వెంట పాకిస్థాన్‌తోపాటు తాము ఉన్నామని ఈ సందర్భంగా ప్రకటించారు. పాకిస్థాన్ వైపు కనీసం కన్నెత్తి చూస్తే భారత్‌ను అల్లా నాశనం చేస్తారని హెచ్చరించారు. ఆ దేశంలో పక్షుల కిలకిలారావాలు వినపడవని అన్నారు. దేవాలయాల్లో గుడి గంటలు కూడా మోగవని తీవ్ర స్వరంతో పాక్ మాజీ మంత్రి పేర్కొన్నారు. భారత్‌లో పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ఏం జరగదని ఆయన అన్నారు. అమెరికా పర్యటనలో ఉన్నప్పుడు తన ఫోన్‌లో హాఫీజ్ సయీద్ ఫోన్ నెంబర్‌ను అధికారులు గుర్తించారని చెప్పారు. దీంతో ఆ దేశం నుంచి తనను బహిష్కరించారని ఈ సందర్భంగా పాక్ మాజీ మంత్రి షేక్ రషీద్ అహ్మద్ గుర్తు చేసుకున్నారు. బహిరంగ సభలో షేక్ రషీద్ చేసిన ఈ వ్యాఖ్యల వీడియో వైరల్ అవుతోంది. లష్కర్ ఎ తైబా సీనియర్ కమాండర్, పాకిస్థాన్ మార్కజీ ముస్లిం లీగ్ అధ్యక్షుడు ఖాలీద్ మసూద్ సంధుతోపాటు ఆ సంస్థ కేంద్ర సలహా కమిటీ సభ్యుడు ఖారీ మొహమ్మద్ యాకూబ్ షేక్ సమక్షంలో పాక్ మాజీ మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు షేక్ రషీద్ అహ్మద్ ముఖ్య అనుచరుడిగా ఉన్నారు. 2020 నుంచి 2022 వరకు ఇమ్రాన్ క్యాబినెట్‌లో దేశ అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రిగా పని చేశారు. అవామీ ముస్లిం లీగ్‌ను షేక్ రషీద్ స్థాపించారు.

# మహిళా బిల్లు ముద్దు..డీలిమిటేషన్ వద్దు

- ప్రస్తుత సంఖ్య ఆధారంగా 33శాతం మహిళా రిజర్వేషన్లు
- తమిళనాడు అసెంబ్లీలో సిఎం విజయ్ తీర్మానం



చెన్నై,ఆగస్ట్12 : అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా తమిళనాడు ప్రభుత్వం వరుస తీర్మానాలను ప్రవేశపెడుతోంది. మొన్న రాష్ట్రగీతం, నిన్న నీట్.. నేడు డీలిమిటేషన్‌పై తీర్మానాలను తీసుకువచ్చింది.లోక్‌సభ నియోజకవర్గ పునర్విభజన డీలిమిటేషన్ కు వ్యతిరేకంగా తమిళనాడు సీఎం విజయ్ అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. డీలిమిటేషన్‌కు తాము అంగీకరించేదే లేదని స్పష్టం చేశారు. జనాభా నియంత్రణకు అనేక చర్యలు తీసుకున్న తమిళనాడుకు డీలిమిటేషన్‌తో నష్టం జరుగు తుందని అన్నారు. జనాభా ఆధారంగా నియోజకవర్గ పునర్విభజన జరిగితే దక్షిణాది రాష్ట్రాలన్నిటికీ నష్టమని చెప్పారు. ఈ తీర్మానంలో సీఎం విజయ్ మొత్తం మూడు డిమాండ్స్‌ను కేంద్రం ముందుంచారు. లోక్‌సభ సీట్ల సంఖ్యను ఎప్పటికీ 543 వద్ద స్తంభింపజేయాలని అన్నారు. రాష్ట్రాలకు ప్రస్తుతమున్న ఎంపీ సీట్ల సంఖ్యను శాశ్వతం చేయాలని అన్నారు. రాష్ట్రాల అసెంబ్లీల్లో కూడా మహిళలకు 33 శాతం రిజర్వేషన్ తీసుకురావాలని అన్నారు. నియోజకర్గాల పునర్ వ్యవస్థీకరణ (అ్ గ÷తిపతిబిజీబితినీని) కోసం కేంద్రం తీసుకువచ్చిన బిల్లును వ్యతిరేకించింది. అదే సమయంలో మహిళా రిజర్వేషన్‌కు మద్దతు ఇచ్చింది. ప్రస్తుతమున్న 543 సీట్లతోనే దానిని అమలు చేయాలని విజయ్ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.తమిళనాడు వంటి దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేశాయని ఈ సందర్భంగా సీఎం విజయ్ అన్నారు. జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరిగితే నష్టం వాటిల్లొచ్చని హెచ్చరించారు. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాలను అలాగే కొనసాగించాలి. ప్రతి రాష్ట్రానికి ప్రస్తుతం కేటాయించిన స్థానాలను శాశ్వతం చేయాలి. రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని కేంద్రం ముందు మూడు డిమాండ్లు ఉంచారు. మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లను 2029 సార్వత్రిక ఎన్నికలకు ముందే కల్పించడానికి పార్లమెంటు ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వం మరోసారి ప్రయత్నిస్తోంది. 543 లోక్‌సభ నియోజకవర్గాలను పునర్విభజించి 816కి పెంచే ప్రతిపాదనపైనా అడుగు ముందుకు వేయాలని చూస్తోంది. ఈ సమయంలో తమిళనాడు ప్రభుత్వం తీర్మానాన్ని ప్రవేశపెట్టడం గమనార్హం. ఇటీవల పశ్చిమబెంగాల్, మహారాష్ట్రల్లో రాజకీయ సమీకరణాల మార్పులతో ఎన్డీయే బలం మరింత పెరిగిందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్న విషయం తెలిసిందే. దీంతో, కేంద్రం డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లును తెచ్చేందుకు మరోసారి ప్రయత్నిస్తుందన్న వార్తలు వచ్చాయి. అయితే, డీలిమిటేషన్‌ను దక్షిణాది రాష్ట్రాలు మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్నాయి. ఈ నేపథ్యంలో తమిళనాడు సీఎం విజయ్ ప్రవేశపెట్టిన తీర్మానం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.

# చేయూత పింఛన్ల దరఖాస్తుల స్వీకరణ పకడ్బందీగా చేపట్టాలి..



**-కలెక్టర్ గరిమ అగ్రవాల్**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

రాజన్న సిరిసిల్ల జిల్లాలో చేయూత పింఛన్ల కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ

వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత, నేత కార్మికులు, ఫైలేరియా, డయాలసిస్ బాధితులకు సంబంధించిన ఏడు రకాల పింఛన్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తుతో ఆధార్, వయస్సు, రేషన్ కార్డు, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాస్‌బుక్ జత చేయాలని సూచించారు. సంబంధిత వర్గాలకు అవసరమైన అదనపు ధ్రువీకరణ పత్రాలను కూడా సమర్పించాలని తెలిపారు.దివ్యాంగులు, తలసేమియా, సికిల్ సెల్, హిమోఫీలియా బాధితులు యూడీఐడీ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను సక్రమంగా నింపి ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేయాలని, ఈ నెల 31లోగా దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో దివ్యాంగులు, తలసేమియా, సికిల్ సెల్, హిమోఫీలియా బాధితుల కోసం ప్రత్యేక సదరం వైకల్య నిర్ధారణ శిబిరాలు నిర్వహించాలని ఆదేశించారు. అర్హులకు సదరం సర్టిఫికెట్లు త్వరగా జారీ చేయాలని సూచించారు.సమావేశంలో జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, వేములవాడ మున్సిపల్ కమిషనర్ లోకేష్, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**ఎయిడ్స్‌పై క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాలి**

ఎయిడ్స్ నియంత్రణపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. గురువారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో వైద్య ఆరోగ్య, సంక్షేమ, విద్య, యువజన, జడ్పీ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు.

జిల్లాలో 1,283 ఎయిడ్స్ పాజిటివ్ కేసులు ఉన్నాయని, బాధితులకు నెలనెలా మందులు అందిస్తున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎయిడ్స్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడంతో పాటు బాధితులకు నిరంతరం వైద్యం, మందులు, కౌన్సెలింగ్ అందించాలని సూచించారు.ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, వేములవాడ ఏరియా ఆసుపత్రి, అర్బన్ హెల్త్ సెంటర్ల పరిధిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. పాజిటివ్ కేసులు గుర్తించిన ప్రాంతాల్లో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు ప్రత్యేక షెడ్యూల్ రూపొందించాలని సూచించారు. యువత, విద్యార్థులకు అవగాహన సదస్సులు, పోటీలు నిర్వహించాలని తెలిపారు.సమావేశంలో జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, జిల్లా వైద్యాధికారి ఏంజెలా ఆల్ఫ్రెడ్, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రవీణ్ కుమార్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, యువజన క్రీడల శాఖ అధికారి రాందాస్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

**ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాన్ని పూర్తి చేయాలి**

జిల్లాలో నిర్దేశించిన ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాన్ని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఉద్యానవన, వ్యవసాయ శాఖ అధికారులు, కంపెనీ ప్రతినిధులతో ఆయిల్‌పామ్ సాగు పురోగతిపై సమీక్ష నిర్వహించారు.

2026–27 ఆర్థిక సంవత్సరానికి మొక్కలు నాటే ప్రక్రియను వేగవంతం చేయాలని, వారం వారీగా లక్ష్యాలు నిర్దేశించుకుని పనిచేయాలని సూచించారు. ఆయిల్‌పామ్ సాగు ప్రయోజనాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, సబ్సిడీలపై రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. డ్రిప్ ఏర్పాటు, మొక్కల సరఫరాలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.సమావేశంలో జిల్లా ఉద్యానవన అధికారి ఆర్. శరత్‌బాబు, జిల్లా వ్యవసాయ అధికారిణి అఫ్జల్ బేగం, ఉద్యానవన శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

**-స్కానింగ్ సెంటర్లపై నిఘా.. నిబంధనలు ఉల్లంఘిస్తే సీజ్..**

**-డీఎంహెచ్‌వో డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

రాజన్న సిరిసిల్ల జిల్లాలో గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ పరీక్షలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఏంజెలా ఆల్ఫ్రెడ్ హెచ్చరించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో పీసీపీఎన్‌డీటీ జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. ఏ స్కానింగ్ సెంటర్‌లోనైనా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు తేలితే సెంటర్‌ను సీజ్ చేయడంతోపాటు బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అన్ని స్కానింగ్ సెంటర్లు పీసీపీఎన్‌డీటీ నిబంధనలు పాటిస్తూ రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా అబార్షన్ మాత్రలు అక్రమ విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని అన్నారు అవసరమైన చోట డీకాయ్ ఆపరేషన్లు నిర్వహించాలని సూచించారు. బాలికల కళాశాలలు, స్వయం సహాయక సంఘాల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు .

మాతృ మరణాలను తగ్గించేందుకు ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఎంసీహెచ్ సూపర్‌వైజర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గర్భిణులకు ఎత్తు, బరువు, బీపీ, హెచ్‌బీ, రక్తహీనత, ప్లేట్‌లెట్లు తదితర పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఏ ఒక్క మాతృమరణం జరగకుండా కృషి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగేందర్‌బాబు, గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ సుగుణ, పీడియాట్రిషియన్ డాక్టర్ పరమేష్, డీపీఆర్వో పి.బి. శ్రీనివాసచారి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రజనీకాంత్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి భాస్కర్, డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు అధికారినంటూ ఫోన్.. రూ.70 వేల టోపీ

**-మీసేవ, నంబర్లు సేకరించి.. సైబర్ మోసాలకు తెర..**

**-చందుర్తిలో సైబర్ మోసం కలకలం.. ఇద్దరు నిందితుల అరెస్ట్**

**- వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు**

బలగం టీవీ, వేములవాడ :

పోలీసు అధికారుల పేరుతో ఫోన్ చేసి అత్యవసరంగా డబ్బులు కావాలని నమ్మించి ఆన్‌లైన్‌లో నగదు బదిలీ చేయించుకుంటున్న ఇద్దరు సైబర్ నిందితులను చందుర్తి పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.18 వేల నగదు, మొబైల్ ఫోన్లు, సిమ్‌కార్డులను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. చందుర్తి పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో

డీఎస్పీ శ్రీనివాసులు మాట్లాడుతూ నల్గొండ జిల్లా మోతే మండలానికి చెందిన కిలుకాని సాయిచంద్ (30), సూర్యాపేటకు చెందిన కట్కూరి శరత్‌కుమార్ (31) ప్రస్తుతం హైదరాబాద్ మీర్‌పేట్‌లోని అల్మాస్‌గూడలో నివసిస్తున్నారని తెలిపారు. వీరిద్దరూ గూగుల్, టెలిగ్రామ్ ద్వారా మీసేవ కేంద్రాలు, మనీ ట్రాన్స్‌ఫర్ సెంటర్ల ఫోన్ నంబర్లు సేకరించేవారని,

ఆ తర్వాత బాధితులకు ఫోన్ చేసి తాము పోలీసు అధికారి ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డిగా పరిచయం చేసుకునేవారని తెలిపారు. పోలీసు అధికారులకు అత్యవసరంగా ఆసుపత్రి ఖర్చుల కోసం డబ్బులు అవసరమయ్యాయని, వెంటనే ఫోన్‌పే ద్వారా నగదు పంపించాలని నమ్మించేవారని అన్నారు .

ముందస్తు పథకం ప్రకారం ఓ పెట్రోల్ బంక్ సిబ్బందిని సంప్రదించి, తమ వాహనం లేదా బోర్‌బండి మరమ్మతులకు వచ్చిందని, తమ సర్ డబ్బులు వారి ఫోన్ నంబర్‌కు పంపిస్తారని చెప్పి నంబర్ తీసుకునేవారు. అనంతరం ఆ నంబర్‌ను మీసేవ నిర్వాహకులకు ఇచ్చి బాధితుల నుంచి ఆన్‌లైన్‌లో నగదు బదిలీ చేయించుకునేవారు. డబ్బులు బదిలీ అయిన తర్వాత పెట్రోల్ బంక్ వద్దకు వెళ్లి నగదు తీసుకునేవారని తెలిపారు. చందుర్తి మండలానికి చెందిన చిలుక పెంటయ్యకు నిందితులు ఫోన్ చేసి, తాము చందుర్తి పోలీస్‌స్టేషన్‌కు చెందిన ఏఎస్సై శ్రీనివాస్‌రెడ్డిగా పరిచయం చేసుకున్నారని, తన కుమారుడి ఆరోగ్యం బాగోలేక హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో చేర్పించామని, అత్యవసరంగా రూ.70 వేలు అవసరమని, డబ్బులు పంపిస్తే హైదరాబాద్ నుంచి తిరిగి వచ్చిన తర్వాత ఇచ్చేస్తానని నమ్మించారని తెలిపారు.వారి మాటలు



నిజమని నమ్మిన పెంటయ్య డబ్బులు పంపేందుకు సిద్ధపడగా.. నిందితులు హైదరాబాద్‌లోని ఓ పెట్రోల్ బంక్‌కు సంబంధించిన ఫోన్ నంబర్ ఇచ్చారని,ఆ నంబర్‌కు పెంటయ్య రూ.70 వేల నగదును ఆన్‌లైన్‌లో బదిలీ చేయగా, డబ్బులు పంపిన వెంటనే నిందితులు ఫోన్లు స్విచ్ఛాఫ్ చేయడంతో మోసపోయినట్లు గుర్తించి చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో చందుర్తి సీఐ రవీందర్, ఎస్ఐ రమేష్, సైబర్ క్రైమ్ ఆర్ఎస్ఐ జునైద్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారని,సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశామని,వారి నుంచి రూ.18 వేల నగదు, నేరానికి ఉపయోగించిన మొబైల్ ఫోన్లు, సిమ్‌కార్డులను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారని అన్నారు.నిందితులను చాకచక్యంగా అరెస్ట్ చేసిన సీఐ రవీందర్, ఎస్ఐ రమేష్, ఆర్ఎస్ఐ జునైద్, సిబ్బంది అనిల్, గంగారెడ్డిని డీఎస్పీ శ్రీనివాసులు ప్రత్యేకంగా అభినందించారు.



# సిరిసిల్ల నుండి సర్ధాపూర్ గోదాంలోకి ఈవీఎంల తరలింపు

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

2018 వేములవాడ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన కోర్టు కేసు కారణంగా ఇంతకాలం సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రత్యేకంగా భద్రపరిచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎంల)ను గురువారం సర్ధాపూర్‌లోని ఈవీఎం గోదాంలోకి తరలించారు.

కోర్టు కేసు ముగిసిన నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం నుంచి అనుమతులు వచ్చిన అనంతరం, ఎన్నికల నిబంధనలు, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఈవీఎంల తరలింపు ప్రక్రియను చేపట్టారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఈ ప్రక్రియను పరిశీలించి, ఈవీఎంలు భద్రపరిచే విధానంపై అధికారులకు పలు సూచనలు చేశారు.2018 వేములవాడ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన కోర్టు కేసు కారణంగా ఇంతకాలం సంబంధిత ఈవీఎంలను ప్రత్యేకంగా సిరిసిల్ల లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భద్రపరిచామని, రాష్ట్ర ఎన్నికల సంఘం అనుమతుల మేరకు ప్రస్తుతం వాటిని సర్ధాపూర్‌లోని గోదాంలో భద్రపరిచేందుకు తరలించినట్లు కలెక్టర్ తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో, పటిష్ట పోలీస్ బందోబస్తు మధ్య ఈవీఎంల తరలింపు ప్రక్రియను పూర్తి చేశామని కలెక్టర్ వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబు, వేములవాడ ఆర్డీఓ కె.ఎస్.బి. కుమారి, తహశీల్దార్లు మహేష్ కుమార్, జయంత్, ఎన్నికల విభాగం నాయబ్ తహసీల్దార్ రెహమాన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు వెంటనే యూనిఫాంలు పంపిణీ చేయాలి



**-బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమై దాదాపు మూడు నెలలు పూర్తవుతున్నా విద్యార్థులకు ఇప్పటి వరకు స్కూల్ యూనిఫాంలు పంపిణీ చేయకపోవడం దురదృష్టకరమని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ అన్నారు. గురువారం జిల్లా విద్యాధికారి కార్యాలయంలో డి ఈ వో కి బీఆర్ఎస్‌వీ నాయకులు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా రవి గౌడ్ మాట్లాడుతూ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా వేలాది మంది విద్యార్థులు పాత యూనిఫాంలతో, కొందరు సాధారణ దుస్తులతో పాఠశాలలకు హాజరవుతున్నారని తెలిపారు. విద్యార్థులకు విద్యతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు, యూనిఫాంలను సకాలంలో అందించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నా యూనిఫాంలు అందకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు .యూనిఫాంల పంపిణీలో జాప్యం కారణంగా పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు ఆర్థిక భారం పడుతోందని, విద్యార్థుల ఆత్మవిశ్వాసం కూడా దెబ్బతింటోందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి నాణ్యమైన యూనిఫాంలను తక్షణమే పంపిణీ చేయాలని,జాప్యానికి కారణమైన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.విద్యార్థుల సమస్యలను అత్యవసరంగా పరిష్కరించి, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. లేనిపక్షంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో నాయకులు మట్టి శ్రీనివాస్, బల్యాల ప్రవీణ్, కోడం వెంకటేశం, గాజుల రిషిత్, స్వాతి, శ్రీకర్, హర్షిత్ తదితరులు పాల్గొన్నారు.



# హోంగార్డ్ బాలరాజుకు ఆత్మీయ వీడ్కోలు

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ శాఖలో 30 ఏళ్లుగా హోంగార్డుగా సేవలందించి పదవీ విరమణ పొందిన బాలరాజుకు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే బాలరాజును పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. పోలీస్ శాఖలో అంకితభావంతో విధులు నిర్వహించి అందరి మన్ననలు పొందారని కొనియాడారు. సుదీర్ఘకాలం అందించిన సేవలు మరువలేనివని తెలిపారు. పదవీ విరమణ అనంతరం కుటుంబపరంగా ఏ సమస్య ఎదురైనా తనను సంప్రదించవచ్చని భరోసా ఇచ్చారు. పదవీ విరమణ కేవలం వృత్తికేనని, వ్యక్తిత్వానికి కాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారిగా విధులు.. కవిగా విశిష్ట గుర్తింపు!

**-రాజన్న సిరిసిల్ల వాసికి ప్రతిష్ఠాత్మక సాహితీ గౌరవం..**

**-శ్రీమద్రామాయణం'కు సురవరం ప్రతాపరెడ్డి పురస్కారం**

బలగం టీవీ,గంభీరావుపేట:

పరిపాలనా బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తూనే సాహిత్య సాధనలోనూ తనదైన ముద్ర వేస్తున్న రాజన్న సిరిసిల్ల జిల్లా వాసి శశికిరణ్ కొమాండూర్‌కు ప్రతిష్ఠాత్మక తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కారం లభించింది. ఆయన రచించిన పద్య మహాకావ్యం 'శ్రీమద్రామాయణం'కు 2024 సంవత్సరానికి గాను సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కారాన్ని ప్రకటించింది.

రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన శశికిరణ్ కొమాండూర్ ప్రస్తుతం తెలంగాణ గవర్నర్ జాయింట్ సెక్రటరీగా, సీనియర్ గ్రూప్-1 అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. ఉద్యోగ బాధ్యతలు ఎంత బిజీగా ఉన్నప్పటికీ గత రెండు దశాబ్దాలుగా సాహిత్యాన్ని తన జీవితంలో భాగంగా మార్చుకొని నిరంతర సాహిత్య సాధన కొనసాగిస్తున్నారు.సామాన్య పాఠకుడికి సైతం సులభంగా అర్థమయ్యే సరళమైన భాషలో, సంప్రదాయ ఛందస్సుతో ఆయన రచించిన 'శ్రీమద్రామాయణం'కు ఇప్పటికే సాహిత్య వర్గాల నుంచి విశేష ఆదరణ లభించింది. ప్రముఖ ప్రచురణ సంస్థ ఎమెస్కో ఈ మహాకావ్యాన్ని ప్రచురించడం విశేషం.సాహిత్య రంగంలో ప్రతిభ కనబరుస్తూనే వ్యక్తిగత జీవితంలోనూ నైతిక విలువలు, నిజాయితీకి పెద్దపీట వేస్తున్న అధికారిగా శశికిరణ్ కొమాండూర్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంది. గతంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం కోసం ఆయన పేరును పరిశీలించినప్పటికీ, తాను సంబంధిత శాఖలో విధులు నిర్వహిస్తున్న కారణంగా ఆ పురస్కారాన్ని స్వీకరించడం నైతికంగా సరైనది కాదని భావించి ఆయన ఆ అవకాశాన్ని సున్నితంగా తిరస్కరించడం ఆయన వ్యక్తిత్వానికి నిదర్శనంగా నిలిచింది.






తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కారానికి ఎంపికైన సందర్భంగా లోక్ భవన్‌లో గ్రూప్-1 అధికారుల సంఘం, అధికారులు, సిబ్బంది శశికిరణ్ కొమాండూర్‌ను ఘనంగా సత్కరించారు. తెలుగు విశ్వవిద్యాలయ సాహితీ పురస్కారానికి ఎంపికైన శశికిరణ్ కొమాండూర్‌ను లోక్ భవన్‌లో

గ్రూప్-1 అధికారుల సంఘం అధ్యక్షుడు మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్, గవర్నర్ ఉప కార్యదర్శి జి. పల్లవి, ప్రెస్ సెక్రటరీ మామిండ్ల దశరథం, సమన్వయ అధికారి మురళీచార్యులు, అకౌంట్స్ ఆఫీసర్ శైలజ, అసిస్టెంట్ కంప్ట్రోలర్ జెడ్. హెరాల్డ్ డేవిడ్, ఉద్యానవన అధికారిణి మాలిని, డీఈఈ శ్రీధర్, సెక్షన్ ఆఫీసర్ ఎస్. రామచంద్రం, సాంఖ్యక అధికారి శ్రీకాంత్, ఏఈఈలు హర్షవర్ధన్, త్రిష తదితరులు శశికిరణ్ కొమాండూర్‌ను సత్కరించి అభినందించారు.

కొత్తపల్లి గ్రామం నుంచి జాతీయ స్థాయిలో సాహిత్య గుర్తింపు పొందుతున్న శశికిరణ్ కొమాండూర్‌కు ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించడం పట్ల జిల్లా ప్రజలు, కవులు, రచయితలు, సాహితీవేత్తలు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు.



# శ్రావణమాసంలోనైనా రాజన్న దర్శనం కల్పించాలి

**- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి**

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

అభివృద్ధి పనుల పేరుతో గత తొమ్మిది నెలలుగా లో భక్తులకు స్వామివారి దర్శనాన్ని పరిమితం చేయడం లేదా నిలిపివేయడం వల్ల వారి మనోభావాలు దెబ్బతింటున్నాయని బీజేపీ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు. శ్రావణమాసంలోనైనా భక్తులందరికీ రాజన్న దర్శన భాగ్యం కల్పించాలని కోరుతూ గురువారం జిల్లా కలెక్టర్‌కు రెడ్డబోయిన గోపి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ తొమ్మిది నెలలుగా రాజన్న దర్శనం కోసం భక్తులు ఎదురుచూస్తున్నారని, ఇకపై మరింత జాప్యం చేయకుండా పవిత్రమైన శ్రావణమాసంలోనే స్వామివారి దర్శనానికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆలయంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నప్పటికీ భక్తుల ఆధ్యాత్మిక భావోద్వేగాలు, విశ్వాసాలను దృష్టిలో ఉంచుకుని దర్శనానికి తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులను కోరారు.ఆలయ అభివృద్ధికి భక్తులు పూర్తిగా సహకరిస్తారని, అయితే అభివృద్ధి పనుల పేరుతో వారి ఆధ్యాత్మిక హక్కులు, మనోభావాలు దెబ్బతినకుండా ప్రభుత్వం, ఆలయ అధికారులు తక్షణమే నిర్ణయం తీసుకోవాలని సూచించారు. శ్రావణమాసం అత్యంత పవిత్రమైనదని, ఈ మాసంలో రాజన్నను దర్శించుకోవాలని లక్షలాది మంది భక్తులు కోరుకుంటారని పేర్కొన్నారు.

భక్తుల విశ్వాసాన్ని గౌరవించి శ్రావణమాసంలో రాజన్న దర్శనానికి అవకాశం కల్పించేలా వెంటనే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని, ఆలయ అధికారులను కోరారు.



## అమెరికాలోనూ భారత స్వాతంత్ర్య దినోత్సవ శోభ

### ఆగస్టు 15ను 'ఇండియా డే'గా ప్రకటించిన డెలావేర్

### భారతీయ అమెరికన్ల సేవలకు దక్కిన గొప్ప గుర్తింపు: గవర్నర్ మ్యాథ్యూ మేయర్

బలగం టీవీ, హైదరాబాద్

భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని (ఆగస్టు 15) పురస్కరించుకుని అమెరికాలోని పలు రాష్ట్రాలు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు అత్యున్నత ప్రాధాన్యతనిస్తున్నాయి. అమెరికా ఆర్థిక, సామాజిక అభివృద్ధిలో భారత సంతతి ప్రజలు అందిస్తున్న సేవలు, సాధించిన విజయాలకు గుర్తింపుగా ఆగస్టు 15ను 'ఇండియా డే' గా గుర్తిస్తూ ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ప్రకటనలు (Proclamations) జారీ చేస్తున్నాయి. తాజాగా డెలావేర్ రాష్ట్రం కూడా ఆగస్టు 15ను అధికారికంగా 'ఇండియా డే'గా ప్రకటిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది.

భారతీయుల సేవలు ప్రశంసనీయం: డెలావేర్ గవర్నర్

డెలావేర్ గవర్నర్ మ్యాథ్యూ మేయర్ సంతకం చేసిన అధికారిక ప్రకటనలో భారతీయ అమెరికన్ల కృషిని ప్రత్యేకంగా కొనియాడారు.

"డెలావేర్‌లో అనేక సంస్కృతులు, సంప్రదాయాలు అనుసరించే ప్రజలు నివసిస్తున్నారు. వారి భాగస్వామ్యంతోనే రాష్ట్రం మరింత బలోపేతమవుతోంది. భారతీయ అమెరికన్ సమాజం తమ నిబద్ధత, నాయకత్వం, సేవల ద్వారా రాష్ట్ర ఆర్థిక, సామాజిక అభివృద్ధికి పెద్ద ఎత్తున తోడ్పడుతోంది. తరతరాలుగా తమ భాష, సంస్కృతి, వైవిధ్యాన్ని అమెరికాలోనూ కొనసాగిస్తూ ప్రత్యేక గుర్తింపును నిలబెట్టుకున్నారు. ఇండియా డే వేడుకల్లో ప్రజలంతా పాల్గొని భారత్‌తో ఉన్న అనుబంధాన్ని గౌరవించాలి" అని గవర్నర్ పిలుపునిచ్చారు.

వరుసగా గుర్తింపు ఇస్తున్న అమెరికా రాష్ట్రాలు

డెలావేర్ కంటే ముందే అమెరికాలోని ప్రముఖ రాష్ట్రాలైన న్యూయార్క్, న్యూజెర్సీ, మాసాచుసెట్స్ రాష్ట్రాలు ఆగస్టు 15కి ప్రత్యేక గుర్తింపునిచ్చాయి. తాజాగా న్యూయార్క్ గవర్నర్ కాథీ హోచుల్, న్యూజెర్సీ గవర్నర్ మికీ షెరిల్ తమ రాష్ట్రాల్లో ఆగస్టు 15ను 'ఇండియన్ ఇండిపెండెన్స్ డే'గా గుర్తిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అమెరికా రాష్ట్ర ప్రభుత్వాల నుంచి లభిస్తున్న ఈ అధికారిక గుర్తింపు పట్ల అక్కడి భారతీయ సమాజం హర్షం వ్యక్తం చేస్తోంది.

అమెరికా వ్యాప్తంగా పండుగ వాతావరణం

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వాషింగ్టన్‌లోని భారత రాయబార కార్యాలయంతో పాటు వివిధ నగరాల్లోని కాన్సులేట్లు, ఐక్యరాజ్యసమితిలోని భారత మిషన్‌లో జాతీయ పతాకావిష్కరణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. అమెరికాలోని ప్రధాన నగరాల్లో ప్రత్యేక పరేడ్‌లు, సాంస్కృతిక కార్యక్రమాలు, సంగీత నృత్య ప్రదర్శనలు నిర్వహించనున్నారు.

వైద్యం, విద్య, సాంకేతికత, వ్యాపారం, రాజకీయాల్లో రాణిస్తున్న భారతీయ అమెరికన్లకు పలువురు అమెరికన్ ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. కాగా, ఆగస్టు 15న న్యూయార్క్‌లోని ప్రసిద్ధ ఎంపైర్ స్టేట్ బిల్డింగ్ సహా ప్రధాన కట్టడాలు భారత త్రివర్ణ పతాక వర్ణాలైన కాషాయం, తెలుపు, ఆకుపచ్చ రంగుల కాంతులతో వెలిగిపోనున్నాయి.



## 'బర్త్ టూరిజం'పై అమెరికా ఉక్కుపాదం: 600కు పైగా వీసాలు రద్దు!

### ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసిన స్టేట్ డిపార్ట్‌మెంట్.. ట్రంప్ ఉత్తర్వులతో చర్యలు

బలగం టీవీ, వాషింగ్టన్

అమెరికా పౌరసత్వం పొందేందుకు సాగించే 'బర్త్ టూరిజం' (జన్మ పర్యాటకం) విధానంపై ట్రంప్ ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టింది. అందులో భాగంగా విదేశీయులకు చెందిన 600కు పైగా వీసాలను రద్దు చేసినట్లు అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ బుధవారం అధికారికంగా వెల్లడించింది. పిల్లలకు జన్మనివ్వడం కోసమే అమెరికాకు ప్రయాణించే వారిని, అలాగే అలాంటి ప్రయాణాలకు సహకరించే వ్యక్తులు, సంస్థలను గుర్తించేందుకు ప్రత్యేకంగా 'బర్త్ టూరిజం నిరోధక టాస్క్‌ఫోర్స్' ను ఏర్పాటు చేసినట్లు తెలిపింది.

ప్రయాణ చరిత్రపై నిశిత పరిశీలన

నూతనంగా ఏర్పాటు చేసిన ఈ టాస్క్‌ఫోర్స్ వీసాదారుల తాజా కార్యకలాపాలను, వారి గత ప్రయాణ చరిత్రను (Travel History) నిశితంగా సమీక్షిస్తుంది. ప్రసవం కోసమే అమెరికాకు వస్తున్నారా అనే అంశాన్ని ఆధారాలతో సహా సేకరించి తగిన చర్యలు తీసుకోనుంది.

ట్రంప్ ఉత్తర్వులతో సంపూర్ణ అధికారాలు

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జారీ చేసిన కార్యనిర్వాహక (ఎగ్జిక్యూటివ్) ఉత్తర్వుల మేరకు ఈ చర్యలు చేపట్టినట్లు స్టేట్ డిపార్ట్‌మెంట్ స్పష్టం చేసింది. బర్త్ టూరిజంతో సంబంధం ఉన్న వ్యక్తులు అమెరికాలోకి ప్రవేశించకుండా నిరోధించేలా, వారి వీసాలను తక్షణమే రద్దు చేసేలా లేదా వారిపై శాశ్వత నిషేధం విధించేలా ఈ ఉత్తర్వులు అధికారులకు పూర్తి అధికారాలను కల్పిస్తున్నాయి.

## 2028లో మూడోసారి పోటీపై స్పందించిన డోనాల్డ్ ట్రంప్

### 'చట్టం చాలా బలమైనది'

### అమెరికా రాజ్యాంగ పరిమితులను తొలిసారిగా అంగీకరించిన ట్రంప్

బలగం టీవీ, వాషింగ్టన్



అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ 2028లో మూడోసారి అధ్యక్ష పదవికి పోటీ చేసే అవకాశం ఉందా? అనే ప్రశ్నకు స్వయంగా ఆయనే స్పష్టత ఇచ్చారు. మళ్లీ ఎన్నికల రేసులో నిలవడానికి తనకు ఆసక్తి ఉన్నప్పటికీ, అమెరికా రాజ్యాంగంలోని కఠినమైన చట్టాలు అందుకు అనుమతించవని ఆయన తేల్చి చెప్పారు. మేరీల్యాండ్‌లోని 'జాయింట్ బేస్ ఆండ్రూస్' వద్ద విలేకరులతో మాట్లాడిన సందర్భంగా 2028లో మూడోసారి పోటీ చేయడంపై అడిగిన ప్రశ్నలకు ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. "ఐ లవ్ టు రన్, బట్ ద లా ఈజ్ వెరీ స్ట్రాంగ్" (పోటీ చేయాలని నాకుంది.. కానీ చట్టం చాలా బలమైనది) అని ఆయన స్పష్టం చేశారు.

"అందరూ 2028 అని అరుస్తున్నారు కానీ!"

తమ రాజకీయ మద్దతుదారుల నుంచి మూడోసారి కూడా అధ్యక్షుడిగా పోటీ చేయాలనే డిమాండ్లు నిరంతరం వస్తూనే ఉన్నాయని ట్రంప్ చెప్పారు.

"అందరూ నన్ను ఇదే ప్రశ్న అడుగుతున్నారు. ఈ విషయంలో అమెరికా చట్టం చాలా కఠినంగా ఉందనే విషయం మీకు కూడా తెలుసు. నాకు మళ్లీ పోటీ చేయాలని ఉంది, కానీ చట్టం అనుమతించడం లేదు. ఇటీవల ఓహియోలో జరిగిన 'పేట్రియట్ గేమ్స్' కార్యక్రమంలో ప్రజలంతా బిగ్గరగా '2028!, 2028!' అని అరిచారు. ప్రతి ఒక్కరూ నేను పోటీ చేయాలని కోరుకుంటున్నారు.. కానీ చట్ట పరిమితులు ఒప్పుకోవట్లేదు" అని ట్రంప్ వివరించారు.

మూడోసారి పోటీపై గతంలోనూ ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన ట్రంప్, తన పదవీకాలాన్ని కొనసాగించాలనే కోరిక ఉన్నప్పటికీ రాజ్యాంగ పరిమితులను బహిరంగంగా అంగీకరించడం ఇదే తొలిసారి.

ఏంటీ 22వ రాజ్యాంగ సవరణ?

అమెరికా రాజ్యాంగంలోని 22వ సవరణ (22nd Amendment) ప్రకారం ఏ ఒక్క వ్యక్తి కూడా రెండుసార్లకు మించి అమెరికా అధ్యక్షుడిగా ఎన్నిక కాకూడదు.

2016: తొలిసారి విజయం సాధించి 2017లో బాధ్యతలు చేపట్టారు.

2024: రెండోసారి విజయం సాధించి 2025లో అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించారు.

వరుసగా కాకుండా, మధ్యలో విరామంతో రెండుసార్లు గెలిచినప్పటికీ రాజ్యాంగ సవరణ ప్రకారం ఆయన రెండుసార్లు అధ్యక్షుడిగా ఎన్నికైనట్లే పరిగణిస్తారు. దీంతో ట్రంప్ నేరుగా 22వ సవరణ పరిధిలోకి వస్తారు. ఫలితంగా 2028లో మూడోసారి అధ్యక్ష బరిలో నిలిచే అర్హతను కోల్పోతారు.

అసలు ఈ చట్టం ఎందుకొచ్చింది?

ప్రారంభంలో అమెరికా రాజ్యాంగంలో అధ్యక్ష పదవీకాలంపై ఎలాంటి నిబంధన లేదు. తొలి అధ్యక్షుడు జార్జ్ వాషింగ్టన్ రెండు పర్యాయాల (8 సంవత్సరాలు) తర్వాత స్వచ్ఛందంగా పదవి నుంచి తప్పుకున్నారు. ఆ తర్వాత వచ్చిన అధ్యక్షులందరూ దశాబ్దాల పాటు వాషింగ్టన్ చూపిన మార్గాన్నే గౌరవిస్తూ పాటించారు.

అయితే ఈ సంప్రదాయాన్ని ఫ్రాంక్లిన్ డి. రూజ్‌వెల్ట్ పక్కనబెట్టి, 1940లో మూడోసారి, 1944లో నాలుగోసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1945లో నాలుగోసారి పదవిలో ఉండగానే ఆయన మరణించారు. రూజ్‌వెల్ట్ సుదీర్ఘకాలం పదవిలో కొనసాగడంతో, ఏ ఒక్క వ్యక్తి చేతిలోనూ ఎక్కువ కాలం అధికారం ఉండకూడదని అమెరికా కాంగ్రెస్ భావించింది. ఈ క్రమంలోనే 1947లో కాంగ్రెస్ 22వ సవరణను ప్రతిపాదించగా, 1951 ఫిబ్రవరిలో అన్ని రాష్ట్రాల ఆమోదంతో రెండు విడతల పరిమితి చట్టం అమల్లోకి వచ్చింది.

## యూరియా కోసం రైతుల నిరీక్షణ..

### -ఫోన్‌లు చేతబట్టి గంటల తరబడి ఎదురుచూపులు..

### -బుకింగ్ కాకపోవడంతో సొసైటీకి తాళం

బలగం టీవీ,గంభీరావుపేట:



పంటలను కాపాడుకోవాలంటే ఎరువులు తప్పనిసరి. కానీ ఎరువుల కోసం రైతులు పొలాల్లో కాకుండా మొబైల్ ఫోన్ల ముందు గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలోని కొత్తపల్లి గ్రామంలో యూరియా కొరతపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.మధ్యాహ్నం మూడు గంటలకు ఫర్టిలైజర్ బుకింగ్ యాప్‌లో యూరియా అందుబాటులోకి వస్తుందని సహకార సంఘం అధికారులు చెప్పడంతో రైతులంతా తమ పనులను పక్కనపెట్టి ఫోన్లు చేతబట్టుకుని ఎదురుచూశారు. యూరియా బుక్ చేసుకోవడానికి రైతులు కళ్లల్లో ఒత్తులు వేసుకుని యాప్‌ను పరిశీలించారు. అయితే బుకింగ్ ప్రారంభమైన కొద్ది క్షణాల్లోనే స్టాక్ పూర్తయిందని చూపించడంతో రైతులు తీవ్ర నిరాశకు గురయ్యారు.యూరియా దొరక్కపోవడంతో ఆగ్రహించిన రైతులు సహకార సంఘం కార్యాలయాన్ని ముట్టడించారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ సొసైటీకి తాళం వేశారు. అసలైన రైతులకే యూరియా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

రైతులకు శాపంగా మారిన ఫర్టిలైజర్ యాప్

రైతుల పనిని సులభతరం చేయాల్సిన సాంకేతికత ఇప్పుడు వారికి శాపంగా మారిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం యూరియా కొనుగోలు చేయాలంటే ఫర్టిలైజర్ బుకింగ్ యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాల్సి వస్తోంది. అయితే క్షేత్రస్థాయిలో అనేక సమస్యలు తలెత్తుతున్నాయని రైతులు చెబుతున్నారు.

రిటైల్ డీలర్ల వద్ద యూరియా విక్రయాలు నిలిచిపోవడం, సహకార సంఘాల్లో తగినంత నిల్వలు లేకపోవడంతో రైతులు పూర్తిగా యాప్‌పైనే ఆధారపడాల్సి వస్తోంది. దీంతో యాప్‌లో బుకింగ్ సమయంలో తీవ్ర పోటీ నెలకొంటోంది.

రెండు బస్తాలకే పరిమితమైన కేటాయింపు

ప్రస్తుతం ఫర్టిలైజర్ యాప్‌లో మండలాన్ని యూనిట్‌గా తీసుకుని యూరియా కేటాయింపులు చేస్తున్నారు. బుకింగ్ సమయంలో ఏ డీలర్ వద్ద నిల్వలు ఉంటే అక్కడ రైతులకు రెండు బస్తాల చొప్పున యూరియాను కేటాయిస్తున్నారు.

ఒక ఎకరం భూమి ఉన్న రైతులకు ఒకేసారి, ఒకటి నుంచి ఐదు ఎకరాల వరకు ఉన్న రైతులకు విడతల వారీగా ఎకరానికి రెండు బస్తాల చొప్పున యూరియాను అందిస్తున్నారు. అయితే ఒకసారి బుకింగ్‌లో గరిష్ఠంగా రెండు బస్తాలు మాత్రమే కేటాయించడంతో ఐదు నుంచి పది ఎకరాల వరకు సాగు చేసే రైతులు పలుమార్లు బుకింగ్ చేసుకోవాల్సి వస్తోంది.

పొలాల్లో పని మానేసి యూరియా కోసం పరుగులు

యూరియా కోసం పదేపదే బుకింగ్ చేయడం, ఎరువుల కోసం పలుమార్లు కేంద్రాలకు వెళ్లాల్సి రావడంతో వ్యవసాయ పనులు దెబ్బతింటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీజన్ మొత్తానికి అవసరమైన యూరియాను ఒకేసారి బుక్ చేసుకునే అవకాశం కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

రైతులకు అవసరమైన సమయంలో యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, యాప్‌లో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## పెండింగ్ స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలి




### -ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :

రాజన్న సిరిసిల్ల జిల్లాలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్యాలయం ఎదుట ధర్నా చేసి ఏవోకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా రూ.10,814 కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం కళాశాలల చుట్టూ తిరగాల్సి వస్తోందని, ఆర్థిక ఇబ్బందులతో చదువును మధ్యలోనే నిలిపివేసే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ప్రభుత్వం వెంటనే బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు సరిపడా తరగతి గదులు కేటాయించాలని, స్ట్రాంగ్ రూములను ఖాళీ చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. బీసీ మహిళా కళాశాల హాస్టల్, ఎస్టీ కళాశాల బాలుర హాస్టల్ ఏర్పాటు చేయాలని, అద్దె భవనాల్లో కొనసాగుతున్న గురుకులాలు, కేజీబీవీలు, సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ఎంఈఓ పోస్టులను భర్తీ చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు కడారి శివ, జిల్లా నాయకులు సాయిరాం, రషీద్, విజయ్, బాలాజీ, ఆదిత్య, రేహాన్, మానస, అఖిల, ప్రియాంక, ప్రవలికతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## టెక్సాస్‌లో ఆర్మీ హెలికాప్టర్ కూలి కార్చిచ్చు

### ఇద్దరు సైనికులు మృతి

### సాలడో పట్టణం సమీపంలో ఘోరం.. వందల ఎకరాల మేర గడ్డి దగ్ధం

బలగం టీవీ, టెక్సాస్

అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రంలో ఘోర ప్రమాదం సంభవించింది. సాలడో (Salado) పట్టణం సమీపంలో అమెరికా సైన్యానికి చెందిన హెలికాప్టర్ (Military Helicopter) కూలిపోవడంతో పెద్ద ఎత్తున కార్చిచ్చు (Wildfire) చెలరేగింది. ఈ దుర్ఘటనలో హెలికాప్టర్‌లో ఉన్న ఇద్దరు సైనికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఇది అత్యంత తీవ్రమైన ఘటన అని బెల్ కౌంటీ షెరీఫ్ కార్యాలయ ప్రతినిధి వెల్లడించారు.

క్షణాల్లో వ్యాపించిన మంటలు

కూలిన వెంటనే హెలికాప్టర్‌లో మంటలు చెలరేగడంతో, అవి పక్కనే ఉన్న గడ్డి మైదానాలకు వేగంగా వ్యాపించాయి. క్షణాల వ్యవధిలోనే వందల ఎకరాల మేర గడ్డి దగ్ధమైంది. ప్రమాద తీవ్రత దృష్ట్యా ముందస్తు జాగ్రత్త చర్యగా సమీప ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

కూలింది అపాచీ అటాక్ హెలికాప్టర్!

ప్రమాదానికి గురైన విమానం 'ఏహెచ్-64 అపాచీ' (AH-64 Apache) అటాక్ హెలికాప్టర్ అని ఫోర్ట్ హుడ్ సైనిక స్థావరం ధ్రువీకరించింది. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించారు. టెక్సాస్ అగ్నిమాపక శాఖ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం సాయంత్రానికి కార్చిచ్చును 50 శాతం వరకు అదుపులోకి తీసుకురాగలిగారు.



కాగా, ఈ హెలికాప్టర్ కూలిపోవడానికి గల అసలు కారణాలపై యూఎస్ మిలిటరీ అధికారులు ప్రత్యేక దర్యాప్తు ప్రారంభించారు.

## తీవ్ర విద్యుత్ సంక్షోభంలో బంగ్లాదేశ్



### సహాయం కోరిన తారిక్ రహమాన్ ప్రభుత్వం

### గ్రామీణ ప్రాంతాల్లో 10 గంటల కోతలు.. భారత్‌ను అదనపు డీజిల్ కోరిన పడోసి దేశం

బలగం టీవీ, టెక్సాస్

పొరుగు దేశం బంగ్లాదేశ్ తీవ్ర విద్యుత్ మరియు ఇంధన సంక్షోభంతో చీకటిలో మగ్గుతోంది. దేశంలో ఎప్పుడూ లేని విధంగా విద్యుత్ కొరత ఏర్పడటంతో తారిక్ రహమాన్ నేతృత్వంలోని ప్రభుత్వం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. దేశవ్యాప్తంగా రోజుకు 9 నుంచి 10 గంటల పాటు విద్యుత్ కోతలు అమలవుతుండటంతో ప్రజల ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది. ఈ తీవ్ర సంక్షోభం నుంచి గట్టెక్కేందుకు బంగ్లాదేశ్ ప్రభుత్వం భారత్ సాయాన్ని అర్థించింది. తమకు అదనపు డీజిల్‌ను సరఫరా చేయాలని కోరింది.

18 వేల మెగావాట్ల డిమాండ్.. ఉత్పత్తయ్యేది 13 వేలే!

ప్రస్తుతం బంగ్లాదేశ్‌లో రోజువారీ విద్యుత్ డిమాండ్ 18,000 మెగావాట్లుగా ఉండగా, ఉత్పత్తి మాత్రం 13,000 మెగావాట్లకు కూడా చేరడం లేదు. తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలు గంటల తరబడి కోతలతో సహనం కోల్పోతున్నారు. పలు ప్రాంతాల్లో ఆగ్రహించిన జనం స్థానిక పవర్ స్టేషన్లు, విద్యుత్ కార్యాలయాలపై దాడులకు దిగుతుండటంతో.. విద్యుత్ కేంద్రాల వద్ద పోలీసు రక్షణ కల్పించాలని ప్రభుత్వం ఆదేశించింది.



పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు రాజధాని ఢాకాతో పాటు ప్రధాన నగరాల్లోని షాపింగ్ మాల్స్, వ్యాపార సముదాయాలు, మార్కెట్లను రాత్రి 8 గంటలకే మూసివేయాలని ఆంక్షలు విధించారు. అలంకారిక విద్యుత్ దీపాలు, విద్యుత్ బోర్డులను నిలిపివేశారు.

ఇంధన కొరతే ప్రధాన కారణం

బంగ్లాదేశ్ తన ఇంధన అవసరాల కోసం 90 శాతం చమురు, 30 శాతం సహజ వాయువును (LNG) విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటుంది. అయితే, అంతర్జాతీయంగా సరఫరా ఆటంకాలు, ఎల్ఎన్‌జీ టెర్మినళ్ల వద్ద సాంకేతిక సమస్యల కారణంగా విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు తగినంత ఇంధనం అందడం లేదు. ముఖ్యంగా గ్యాస్ ఆధారిత విద్యుత్ కేంద్రాలు సగం సామర్థ్యంతోనే పనిచేస్తుండటం విద్యుత్ సరఫరాపై తీవ్ర ప్రభావం చూపింది.

భారత్‌ను కోరిన బంగ్లాదేశ్

ఈ ఇంధన అభద్రతను అధిగమించడానికి 'భారత్-బంగ్లాదేశ్ ఫ్రెండ్‌షిప్ పైప్‌లైన్' ద్వారా తమకు మరిన్ని టన్నుల డీజిల్‌ను అత్యవసరంగా సరఫరా చేయాలని బంగ్లాదేశ్ విజ్ఞప్తి చేసింది. ఇటీవల భారత హైకమిషనర్ దినేష్ త్రివేదితో జరిగిన సమావేశంలో బంగ్లాదేశ్ ఇంధన శాఖ మంత్రి ఇక్బాల్ హసన్ మహమూద్ ఈ విషయాన్ని చర్చించారు. రెండు దేశాల మధ్య ఇంధన అనుసంధానం అత్యంత కీలకమని, బంగ్లాదేశ్‌కు అదనపు డీజిల్ అందించి విద్యుత్ సంక్షోభం నుంచి గట్టెక్కించాలని కోరారు. దీనిపై భారత ప్రభుత్వం సానుకూలంగా స్పందించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# కేఎల్ రాహులే మా 'ఎక్స్ ఫ్యాక్టర్'

### 2-0తో సిరీస్ నెగ్గడమే లక్ష్యం.. ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగే అవకాశం: మోర్నీ మోర్కెల్

బలగం టీవీ, హైదరాబాద్

వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (WTC) 2027 ఫైనల్ బెర్త్ ఆశలను సజీవంగా ఉంచుకోవడమే లక్ష్యంగా టీమిండియా మరో కీలక సమరానికి సిద్ధమైంది. శ్రీలంకతో జరిగే రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా శుక్రవారం (ఆగస్టు 15) నుంచి గాల్ వేదికగా తొలి టెస్ట్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్‌ను 2-0తో క్లీన్ స్వీప్ చేయాలనే పట్టుదలతో భారత జట్టు ఉంది. ఈ క్రమంలో వైస్ కెప్టెన్ కేఎల్ రాహుల్ జట్టుకు 'ఎక్స్ ఫ్యాక్టర్'గా మారతాడని టీమిండియా బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ స్పష్టం చేశారు.

రాహుల్‌కు అపార అనుభవం

తొలి టెస్ట్ నేపథ్యంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మోర్నీ మోర్కెల్ మాట్లాడారు. ప్రస్తుత భారత బ్యాటింగ్ లైనప్‌లో కేఎల్ రాహుల్‌కు మాత్రమే శ్రీలంకలో ఆడిన అనుభవం ఉందనే విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

"టెస్టుల్లో కేఎల్ రాహుల్ గత కొన్నేళ్లుగా భారత బ్యాటింగ్ విభాగాన్ని నడిపిస్తున్న తీరు అద్భుతం. ఇక్కడి కండిషన్స్, పిచ్‌లపై అతనికి ఉన్న అపార అనుభవం ప్రాక్టీస్ సెషన్లలో యువ ఆటగాళ్లకు ఎంతగానో ఉపయోగపడింది. స్థానిక పరిస్థితులకు అలవాటు పడేందుకు మేము 10 రోజుల ముందే ఇక్కడికి వచ్చాం. ఈ సిరీస్ నెగ్గడమే మా ప్రధాన లక్ష్యం" అని మోర్కెల్ పేర్కొన్నారు.

ముగ్గురు స్పిన్నర్లతో అటాక్!




గాల్ పిచ్ స్వభావాన్ని పరిగణనలోకి తీసుకొని టీమిండియా ముగ్గురు స్పిన్నర్లతో బరిలోకి దిగే అవకాశం ఉందని మోర్కెల్ వెల్లడించారు. ఒకవైపు నుంచి భారత స్పిన్ దళం అటాక్ చేస్తే, మరోవైపు నుంచి పేసర్లు ఒత్తిడి తీసుకురాగలరని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. మ్యాచ్ సాగేకొద్దీ పిచ్ ప్రవర్తనలో మార్పులు వస్తాయని, ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు మానసిక బలం, బ్యాటింగ్‌లో సమయం గడపడం, సరైన ప్రదేశాల్లో బౌలింగ్ చేయడం చాలా ముఖ్యమని వివరించారు.

బౌలింగ్‌లో అనుభవలేమి సవాల్

ప్రస్తుత భారత జట్టు బ్యాటింగ్ పరంగా బలంగానే కనిపిస్తున్నప్పటికీ, బౌలింగ్ విభాగంలో కొంత అనుభవలేమి కనిపిస్తోంది. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా జట్టుకు దూరం కావడం పెద్ద లోటుగా మారగా.. కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా మినహా మిగతా ఆటగాళ్లెవరికీ శ్రీలంక నేలపై టెస్టులు ఆడిన అనుభవం లేదు. ఈ నేపథ్యంలో యువ బౌలర్లు ఏ మేరకు రాణిస్తారో వేచి చూడాల్సిందే.

# కీమర్ చేతిలో పోరాడి ఓడిన ప్రజ్ఞానంద




### మూడో రౌండ్‌లోనూ ఓటమి.. అగ్రస్థానంలో కొనసాగుతున్న వెస్లీ సో

బలగం టీవీ, సెయింట్ లూయిస్ (అమెరికా)

గ్రాండ్ చెస్ టూర్ పరిధిలోని ప్రతిష్టాత్మక సింక్విఫీల్డ్ కప్ చెస్ టోర్నీలో భారత గ్రాండ్ మాస్టర్ ఆర్. ప్రజ్ఞానందకు ఎదురుదెబ్బ తగిలింది. గురువారం రాత్రి హోరాహోరీగా జరిగిన మూడో రౌండ్ మ్యాచ్‌లో జర్మనీకి చెందిన యువ ఆటగాడు విన్సెంట్ కీమర్ చేతిలో ప్రజ్ఞానంద ఓటమిపాలయ్యాడు.

ఇటీవలి కాలంలో అద్భుత ప్రదర్శనతో దూసుకుపోతున్న ప్రజ్ఞానంద, గత ఏడాది కాలంగా రాణిస్తున్న కీమర్ వ్యూహాల ముందు లొంగిపోక తప్పలేదు. ఈ ఓటమితో మూడు రౌండ్లు ముగిసేసరికి ప్రజ్ఞానంద 1.5 పాయింట్లతో ఉమ్మడిగా నాలుగో స్థానానికి పడిపోయాడు. మొత్తం $4,75,000 (సుమారు రూ. 3.9 కోట్లు) ప్రైజ్ మనీ కలిగిన ఈ టోర్నీలో మరో ఆరు రౌండ్ల ఆట మిగిలి ఉంది.

అగ్రస్థానంలో వెస్లీ సో

మూడో రౌండ్‌లో అత్యంత కీలక విజయాన్ని అమెరికా ప్లేయర్ వెస్లీ సో నమోదు చేశాడు. సొంతదేశానికే చెందిన దిగ్గజ ఆటగాడు ఫాబియానో కరువానాను ఓడించి వరుసగా రెండో విజయాన్ని అందుకున్నాడు. దీంతో 2.5 పాయింట్లతో టోర్నీలో ఏకైక లీడర్‌గా అవతరించాడు. లెవాన్ అరోనియన్ (అమెరికా), మాగ్జిమ్ వాచియర్ లగ్రావ్ (ఫ్రాన్స్) చెరో 2 పాయింట్లతో తదుపరి స్థానాల్లో ఉన్నారు. ప్రజ్ఞానందతో పాటు కరువానా, కీమర్, శామ్యూల్ సేవ్యాన్ తలా 1.5 పాయింట్లతో ఉమ్మడి నాలుగో స్థానంలో కొనసాగుతున్నారు.

మరోవైపు ఈ ఏడాది చివర్లో డి. గుకేష్‌తో వరల్డ్ ఛాంపియన్‌షిప్ పోరులో తలపడనున్న ఉజ్బెకిస్తాన్ గ్రాండ్ మాస్టర్ జవోఖిర్ సిందరోవ్, అనిష్ గిరి (హాలాండ్) చెరో 1 పాయింట్‌తో ఉండగా.. జోర్డెన్ వాన్ ఫారెస్ట్ అర్ధ పాయింట్‌తో చివరి స్థానంలో ఉన్నాడు.

చెక్‌మేట్‌తో ముగిసిన మ్యాచ్

కీమర్‌పై గతంలో మంచి రికార్డు ఉన్నప్పటికీ ప్రజ్ఞానందకు ఈ మ్యాచ్ ఏమాత్రం సులభంగా సాగలేదు. ప్రారంభంలో బాగానే ఆడినప్పటికీ, మ్యాచ్ మధ్యలో చేసిన చిన్న పొరపాటు అతనికి తీవ్ర నష్టం కలిగించింది. అరుదుగా గ్రాండ్ మాస్టర్ స్థాయి మ్యాచ్‌లలో కనిపించే 'చెక్‌మేట్'తో ప్రజ్ఞానంద ఓటమి ఖాయమైంది.

ఇతర మ్యాచ్‌ల్లో అనిష్ గిరిపై శామ్యూల్ సేవ్యాన్ సుదీర్ఘ పోరాటం తర్వాత విజయం సాధించగా.. సిందరోవ్‌తో వాచియర్ లగ్రావ్, జోర్డెన్ వాన్ ఫారెస్ట్‌తో అరోనియన్ మ్యాచ్‌లను డ్రాగా ముగించారు.

# ఫిఫా ఆసియాన్ కప్ నుంచి టీమిండియా నిష్క్రమణ

### బ్రెజిల్‌తో ఫ్రెండ్లీ మ్యాచ్‌కే మొగ్గు
### షెడ్యూల్ కలసిరాకపోవడంతో ఏఐఎఫ్‌ఎఫ్ కీలక నిర్ణయం

బలగం టీవీ, హైదరాబాద్

తొలిసారి నిర్వహించనున్న ఫిఫా ఆసియాన్ (ASEAN) కప్ టోర్నీ నుంచి భారత ఫుట్‌బాల్ జట్టు వైదొలిగింది. వచ్చే అక్టోబర్‌లో ఐదుసార్లు ప్రపంచ ఛాంపియన్ బ్రెజిల్‌తో జరగనున్న ప్రతిష్టాత్మక అంతర్జాతీయ ఫ్రెండ్లీ మ్యాచ్‌కే మొదటి ప్రాధాన్యత ఇస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ (AIFF) డిప్యూటీ సెక్రటరీ జనరల్ ఎం. సత్యనారాయణ గురువారం వెల్లడించారు.

టోర్నీ నుంచి తప్పుకోవడంతో ఆసియాన్ ప్రాంతంలోని బలమైన జట్లతో తలపడే అవకాశాన్ని భారత్ కోల్పోవాల్సి వచ్చింది. "ఒకే సమయంలో బ్రెజిల్ మ్యాచ్, ఆసియాన్ కప్ రెండూ ఆడటం సాధ్యం కాదు. అందుకే ఆసియాన్ కప్ నుంచి వైదొలిగాం" అని సత్యనారాయణ తెలిపారు.

ఒకే సమయంలో రెండు మ్యాచ్‌లు

ఫిఫా ప్రత్యేక ఆహ్వానం మేరకు భారతదేశం ఈ టోర్నీలో పాల్గొనడానికి మొదట అంగీకరించింది. డివిజన్ 1 గ్రూప్-ఎలో ఇండోనేషియా, మలేషియా, సింగపూర్‌లతో కలిసి భారత్ డ్రా అయింది. సెప్టెంబర్ 21 నుండి అక్టోబర్ 6 వరకు ఈ టోర్నమెంట్ నిర్వహించేలా షెడ్యూల్ ఖరారైంది.

అయితే, అక్టోబర్ 3న కోల్‌కతాలోని సాల్ట్ లేక్ స్టేడియంలో బ్రెజిల్‌తో టీమిండియా తలపడాల్సి ఉంది. రెండు మ్యాచ్‌ల తేదీలు



ఒకే సమయంలో రావడంతో ఏఐఎఫ్‌ఎఫ్ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రత్యామ్నాయంగా ద్వితీయ శ్రేణి (రిజర్వ్) జట్టును పంపాలని భావించినప్పటికీ, చివరికి పూర్తిగా టోర్నీ నుంచే తప్పుకోవడమే మేలని భావించింది.

మరిన్ని బలమైన జట్లతో పోటీ?

2027 ఏఎఫ్సీ ఆసియా కప్‌కు అర్హత సాధించలేకపోయిన టీమిండియాకు అంతర్జాతీయ స్థాయిలో బలమైన జట్లతో ఆడే అవకాశాలు తక్కువగా లభిస్తున్నాయి. ఈ నేపథ్యంలో 2026 ఫిఫా వరల్డ్ కప్‌లో పాల్గొన్న కేప్ వర్డే, ఇరాన్ వంటి జట్లతో కూడా ఫ్రెండ్లీ మ్యాచ్‌లు ఆడేందుకు ఏఐఎఫ్‌ఎఫ్ చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. అయితే వీటిపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

# లెహ్‌లో తొలి 24x7 ఐస్ హాకీ రింక్ ప్రారంభం



### వింటర్ స్పోర్ట్స్‌కు కొత్త వెలుగులు!
### రూ. 42 కోట్లతో అత్యాధునిక సదుపాయం..
### ఏడాది పొడవునా ప్రాక్టీస్ చేసే వెసులుబాటు

బలగం టీవీ, హైదరాబాద్

లడఖ్‌లో శీతాకాల క్రీడల (వింటర్ స్పోర్ట్స్) మౌలిక సదుపాయాల విస్తరణలో ఒక చారిత్రాత్మక ఘట్టం నమోదైంది. లెహ్‌లోని ఎన్డీఎస్ (NDS) స్టేడియంలో నిర్మించిన కేంద్రపాలిత ప్రాంతపు (UT) తొలి అంతర్జాతీయ స్థాయి కృత్రిమ ఐస్ హాకీ రింక్‌ను లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా గురువారం ప్రారంభించారు. ఈ కొత్త సదుపాయం లడఖ్ యువ క్రీడాకారుల భవిష్యత్తుకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు.

సుమారు రూ. 42 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన ఈ అత్యాధునిక రింక్‌లో 24x7 చల్లబరిచే (Chilling) సౌకర్యం కలదు. దీనివల్ల వాతావరణ పరిస్థితులతో సంబంధం లేకుండా క్రీడాకారులు ఏడాది పొడవునా ఐస్ హాకీ సాధన చేయవచ్చు.

ఏడాది పొడవునా శిక్షణ పొందే అవకాశం

ఈ సందర్భంగా ఎల్జీ సక్సేనా మాట్లాడుతూ, లడఖ్‌ను భారత్‌లోనే కాకుండా ప్రపంచ శీతాకాల క్రీడల కేంద్రాలలో (Winter Sports Hubs) ఒకటిగా మార్చడంలో ఇది మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలోని సరిహద్దు, మారుమూల ప్రాంతాల్లో కూడా నాణ్యమైన క్రీడా మౌలిక సదుపాయాలను విస్తరించాలనే ప్రధాని నరేంద్ర మోదీ ఆలోచనలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు తెలిపారు.

"ఈ 24x7 చిల్లింగ్ ఫెసిలిటీ వల్ల మన యువ క్రీడాకారులు ప్రాక్టీస్ కోసం శీతాకాలం వరకు వేచి చూడాల్సిన అవసరం లేదు. అంతర్జాతీయ స్థాయిలో పోటీపడటానికి అవసరమైన నిరంతర శిక్షణను ఇప్పుడు ఏడాది పొడవునా పొందే వెసులుబాటు లభించింది. ఇది లడఖ్ క్రీడాకారులను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తుంది" అని ఎల్జీ స్పష్టం చేశారు.

క్రీడా పర్యాటకానికి ప్రాణం

పోటీ క్రీడలతో పాటు, ఈ ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు ప్రాంతీయంగా క్రీడా పర్యాటకానికి (Sports Tourism), స్థానిక ఆర్థిక వ్యవస్థకు కొత్త అవకాశాలను సృష్టిస్తాయని సక్సేనా అభిప్రాయపడ్డారు. లెహ్ మరియు లడఖ్‌లోని ఇతర ప్రాంతాల నుంచి కొత్త ప్రతిభను గుర్తించి జాతీయ, అంతర్జాతీయ పోటీలకు సిద్ధం చేయడానికి ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు.

కాలపరిమితి సవాలుకు చెక్!

ఇప్పటివరకు లడఖ్‌లో ప్రతికూలమైన సహజ సిద్ధ ఐస్ కాలం (Winter season) మాత్రమే అందుబాటులో ఉండేది. క్రీడాకారులు సాధన చేయడానికి సంవత్సరంలో కేవలం 2 నుండి 3 నెలల సమయం మాత్రమే లభించేది. దీంతో టోర్నమెంట్లు, సాధన చాలా తక్కువ సమయంలోనే ముగించాల్సి వచ్చేది.

ఈ కొత్త 24x7 ఆర్టిఫిషియల్ రింక్ ప్రారంభంతో ఆ పరిమితి తొలగిపోయిందని, లడఖ్ ఐస్ హాకీ క్రీడాకారుల నైపుణ్యాలు మరింత మెరుగవుతాయని లోక్ భవన్ ప్రతినిధి వెల్లడించారు.





# గౌతమ్ గంభీర్‌కు హర్భజన్ సింగ్ మద్దతు

### "ఓటమికి కోచ్‌ను బాధ్యుడిని చేయడం తగదు"
### గంభీర్ నిక్కచ్చిగా మాట్లాడే మనిషి.. రోహిత్, కోహ్లీలపై ఆసక్తికర వ్యాఖ్యలు

బలగం టీవీ, హైదరాబాద్

టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌పై వస్తున్న విమర్శలపై భారత మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ తీవ్రంగా స్పందించాడు. జట్టు వైఫల్యాలకు కోచ్‌ను బాధ్యుడిని చేస్తూ నిందించడం సరైన పద్ధతి కాదని ఆయన అభిప్రాయపడ్డాడు. గంభీర్ ముక్కుసూటిగా ఉండే వ్యక్తి అని, ఆయన తీసుకునే నిర్ణయాలు, వాస్తవాలను నిక్కచ్చిగా మాట్లాడటం కొందరికి నచ్చడం లేదని వ్యాఖ్యానించాడు. గంభీర్ మార్గదర్శకత్వంలోనే టీమిండియా గతంలో ఐసీసీ టోర్నీలను గెలుచుకుందనే విషయాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశాడు.

గంభీర్ గెలుపు కోసమే పోరాడతాడు

శ్రీలంకతో టెస్ట్ సిరీస్‌కు ముందు మీడియా, యూట్యూబ్ ఛానెల్ వేదికగా హర్భజన్ సింగ్ మాట్లాడుతూ గంభీర్‌కు పూర్తి మద్దతుగా నిలిచాడు.

"గంభీర్ నాకు కెరీర్ ఆరంభం నుంచీ తెలుసు. ఆట పట్ల అతనికి ఉన్న నిబద్ధత అసాధారణమైనది. అతను కపటం లేకుండా నిజాయితీగా మాట్లాడుతాడు. పుస్తకం కవర్‌ను చూసి లోపల ఏముందో అంచనా వేయనట్లే, గంభీర్ నిర్ణయాల ఆధారంగా అతని కోచింగ్‌ను తప్పుబట్టడం సరికాదు. అతను విజయం కోసం తప్ప ఓటమిని లేదా మ్యాచ్‌ను డ్రా చేసుకోవడాన్ని ఏమాత్రం సహించడు" అని హర్భజన్ పేర్కొన్నాడు.

రోహిత్, కోహ్లీల వయసు కాదు.. ప్రదర్శనే ముఖ్యం

సీనియర్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలను వన్డేల్లో కొనసాగించడాన్ని హర్భజన్ సమర్థించాడు. ఫుట్‌బాల్ దిగ్గజాలు లియోనెల్ మెస్సీ, క్రిస్టియానో రొనాల్డోలు ఇప్పటికీ ఆడుతున్నప్పుడు కోహ్లీ, రోహిత్ వన్డేల్లో ఆడితే తప్పేంటని ప్రశ్నించాడు.

"ఏ ఆటగాడికైనా ప్రదర్శనే కొలమానం తప్ప వయసు కాదు. 37 ఏళ్ల వయసులోనూ విరాట్ కోహ్లీ 20 ఏళ్ల కుర్రాడిలా ఫిట్‌గా ఉంటాడు. జట్టులో ఫిట్‌నెస్ విప్లవాన్ని తెచ్చిన కోహ్లీ భారత్‌కు మెస్సీ లాంటివాడు. ఆఖరి రోజు 400 పరుగుల లక్ష్యమున్నా గెలుపు కోసం పోరాడే తత్వం అతనిది. రోహిత్, కోహ్లీలు ఇప్పటికీ అత్యుత్తమంగా రాణిస్తున్నారు కాబట్టి వారిని వన్డేల్లో కొనసాగించాల్సిందే" అని స్పష్టం చేశాడు.

సవాల్‌గా శ్రీలంక సిరీస్

కాగా, శనివారం నుంచి శ్రీలంకతో గాల్ వేదికగా ప్రారంభంకానున్న రెండు టెస్టుల సిరీస్ టీమిండియాకు అత్యంత కీలకంగా మారింది. డబ్ల్యూటీసీ (WTC) ఫైనల్ రేసులో నిలవాలంటే ఈ సిరీస్‌ను భారత్ క్లీన్ స్వీప్ చేయాల్సి ఉంది. ఇటీవల టెస్టుల్లో ఎదురైన పరాజయాల నేపథ్యంలో హెడ్ కోచ్ గంభీర్, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సారథ్యంలోని భారత జట్టుకు ఈ సిరీస్ విజయం అత్యంత ప్రధానంగా మారింది.

# ఆటగాళ్ల ఘర్షణలో మాజీ క్రికెట్ కోచ్ దుర్మరణం

### మంచినీళ్ల విషయంలో మొదలైన వివాదం.. 17 ఏళ్ల స్కూల్ క్రికెటర్ అరెస్ట్

బలగం టీవీ, హైదరాబాద్

శ్రీలంక క్రికెట్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మ్యాచ్ సమయంలో ఆటగాళ్ల మధ్య జరిగిన ఘర్షణలో గాయపడి 62 ఏళ్ల సీనియర్ క్రికెట్ కోచ్ సుమిత్ ఫెర్నాండో కన్నుమూశారు. శ్రీలంక వన్డే కెప్టెన్ కుశాల్ మెండిస్‌తో పాటు పలువురు జాతీయ స్థాయి ఆటగాళ్లకు ఆయన పాఠశాల రోజుల్లో శిక్షణ ఇచ్చారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆగస్టు 8న జరిగిన ఓ క్రికెట్ మ్యాచ్ సందర్భంగా తాగునీటి (డ్రింకింగ్ వాటర్) విషయంలో ఇద్దరు ఆటగాళ్ల మధ్య తీవ్ర వివాదం చెలరేగింది. ఈ గొడవను సర్దిచెప్పేందుకు ప్రయత్నించిన కోచ్ సుమిత్ ఫెర్నాండోపై 17 ఏళ్ల స్కూల్ క్రికెటర్ దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన ఫెర్నాండోను వెంటనే ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆయన మంగళవారం తుదిశ్వాస విడిచారు.

బాలుడి అరెస్ట్.. 17 వరకు కస్టడీ

ఫెర్నాండోపై దాడికి పాల్పడిన 17 ఏళ్ల పాఠశాల విద్యార్థిని సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం అతడిని కొలంబో కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం ఆగస్టు 17 వరకు సదరు బాలుడిని చైల్డ్ ప్రొబేషన్ కస్టడీకి తరలిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

క్రికెట్ రంగానికి తీరని లోటు

కొలంబో శివారు ప్రాంతమైన మొరటువలోని ప్రసిద్ధ 'ప్రిన్స్ ఆఫ్ వేల్స్ కాలేజ్'కు సుమిత్ ఫెర్నాండో సుదీర్ఘకాలం పాటు కోచ్‌గా వ్యవహరించారు. కుశాల్ మెండిస్‌తో పాటు శ్రీలంక పాఠశాల స్థాయి నుంచి ఎందరో ప్రతిభావంతులైన క్రికెటర్లను తీర్చిదిద్దడంలో ఆయన కీలక పాత్ర పోషించారు. అనంతరం శ్రీలంక ఫస్ట్-క్లాస్ టోర్నీలలో భాగమైన 'బ్లూమ్‌ఫీల్డ్ క్రికెట్ & అథ్లెటిక్ క్లబ్' క్యూరేటర్‌గా కూడా సేవలు అందించారు.

కోచ్ సుమిత్ ఫెర్నాండో అంత్యక్రియలు గురువారం బంధువులు, పలువురు క్రికెటర్ల సమక్షంలో ముగిశాయి. ఆయన అకాల మరణం పట్ల శ్రీలంక క్రికెట్ వర్గాలు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశాయి.




# రాహుల్‌తో చర్చలు.. స్పిన్‌పై ప్రత్యేక సాధన

### గాల్ టెస్టుకు ధ్రువ్ జురెల్ కఠిన సన్నాహకాలు
### తప్పులు దిద్దుకోకుంటే సర్ఫరాజ్‌తో ముప్పు.. తుది జట్టు స్థానంపై తీవ్ర ఒత్తిడి!

బలగం టీవీ, హైదరాబాద్

ఉక్కపోతతో కూడిన గాల్ మైదానంలో టీమిండియా యంగ్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ నెట్స్ ప్రాక్టీస్‌లో అత్యంత ఏకాగ్రతతో కనిపించాడు. పేసర్లు, స్పిన్నర్ల బౌలింగ్‌ను ఎంతో చాకచక్యంగా ఎదుర్కొంటూ, ఫీల్డింగ్ సెషన్‌లో కష్టమైన క్యాచ్‌లను పట్టి ఆకట్టుకున్నాడు. అయితే, నెట్స్‌లో కనిపిస్తున్న ఈ ఉత్సాహం వెనుక జురెల్ టెస్ట్ కెరీర్ ప్రస్తుతం ఒక కీలక మలుపులో (Cross-roads) ఉందనడంలో సందేహం లేదు.

గత ఏడాది అక్టోబర్‌లో అహ్మదాబాద్‌లో వెస్టిండీస్‌పై అద్భుత సెంచరీ సాధించిన తర్వాత, జురెల్ ఆడిన తదుపరి టెస్టుల్లో వరుసగా తీవ్రంగా విఫలమయ్యాడు (44, 6, 14, 13, 0, 2, 19). మరీ ముఖ్యంగా, ఈ ఏడు ఇన్నింగ్స్‌ల్లో ఐదుసార్లు స్పిన్నర్లకే వికెట్ పారేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. గాల్ వేదికగా ప్రభాత్ జయసూర్య నేతృత్వంలోని శ్రీలంక స్పిన్ దళాన్ని ఎదుర్కొనేందుకు జురెల్ సిద్ధమవుతున్నాడు.

సర్ఫరాజ్ ఖాన్ నుంచి గట్టి పోటీ

జురెల్ ఆడే స్థానంలోనే (Middle Order) బరిలోకి దిగే సర్ఫరాజ్ ఖాన్ జట్టులో ఉండటం అతనికి ఒక హెచ్చరిక లాంటిదే. స్పిన్నర్లపై సర్ఫరాజ్‌కు స్వీప్‌లు, రివర్స్ స్వీప్‌లు, కట్ షాట్లు ఆడే సుదీర్ఘమైన రేంజ్ ఉంది. కానీ జురెల్ స్పిన్నర్లు తప్పులు చేసే వరకు వేచి చూసే సంప్రదాయ శైలిని ఇష్టపడతాడు. ఫ్లాట్ వికెట్లపై ఈ వ్యూహం వర్కౌట్ అయినా, గాల్ వంటి వేరియబుల్ బౌన్స్, స్పిన్ లభించే పిచ్‌లపై ప్రమాదకరంగా మారుతుంది.

కెఎల్ రాహుల్‌తో ప్రత్యేక చర్చలు

శ్రీలంక నేలపై టెస్టులు ఆడిన అనుభవం ఉన్న ఏకైక భారత బ్యాటర్ కేఎల్ రాహుల్ మాత్రమే. ఈ సిరీస్ కోసం రాహుల్ ముంబైలోని ప్రత్యేకమైన మట్టి పిచ్‌లపై విస్తృతంగా సాధన చేశాడు. దీంతో శ్రీలంక పరిస్థితులను ఎదుర్కొనే క్రమంలో నెట్స్ వద్ద కేఎల్ రాహుల్‌తో జురెల్ సుదీర్ఘ సమయం చర్చలు జరపడం కనిపించింది.

ఈ విషయంపై బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ స్పందిస్తూ.. "గత కొన్నేళ్లుగా బ్యాటింగ్‌లో రాహుల్ అద్భుతంగా రాణిస్తున్నాడు. ఇక్కడి వాతావరణం, పరిస్థితులపై యువ ఆటగాళ్లకు దిశానిర్దేశం చేసే బాధ్యతను ఆయన సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నాడు" అని తెలిపారు.

జురెల్‌కు కీలకమైన సిరీస్

ప్రస్తుతం రిషభ్ పంత్ మొదటి ఛాయిస్ వికెట్ కీపర్‌గా ఉండటంతో, జురెల్ జట్టులో స్వచ్ఛమైన బ్యాటర్‌గానే అవకాశాలు దక్కించుకోవాల్సి ఉంది. ఇటీవల ఇదే గాల్ మైదానంలో శ్రీలంక-ఎ జట్టుపై భారత్-ఎ తరఫున ఒక సెంచరీ, హాఫ్ సెంచరీ సాధించడం జురెల్‌కు కొంత ఆత్మవిశ్వాసాన్ని ఇచ్చేంశమే. అయితే, జాతీయ జట్టు తరఫున మెరుగైన పరుగులు సాధిస్తేనే టెస్టుల్లో అతని భవిష్యత్తు సురక్షితంగా ఉంటుంది. మరి శ్రీలంక స్పిన్ సవాలును అధిగమించి జురెల్ తన స్థానాన్ని నిలబెట్టుకుంటాడో లేదో వేచి చూడాలి.

# సుకుమార్ కూతురు సుకృతివేణికి బోస్టన్ స్కూల్ స్కాలర్‌షిప్



'పుష్ప' చిత్రాలతో పాన్ ఇండియా స్థాయిలో దర్శకుడిగా మంచి గుర్తింపు పొందారు సుకుమార్. ఇటీవల జాతీయ అవార్డుల్లో ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయిత గానూ ఘనత సాధించారు. ఆయన తనయ సుకృతి వేణి కూడా విభిన్న బాటలో పయనిస్తున్నారు. 2024 సంవత్సరానికి జాతీయ ఉత్తమ బాల నటిగా 'గాంధీ తాత చెట్టు'కు అవార్డు సాధించిన సుకృతి వేణి ఇప్పుడు మరో అరుదైన ఘనతను కైవ సం చేసుకుంది. అమెరికాలోని 'బోస్టన్ అంతర్జాతీయ బర్క్‌లీ స్కూల్ ఆఫ్ మ్యూజిక్' సంగీత విభాగంలో ఎన్‌సెం బుల్ ఎక్స్‌లెన్స్ అవార్డుకు ఎంపికై ఫుల్ స్కాలర్‌షిప్‌ను సొంతం చేసుకున్నారు. మొత్తం 272 మంది పిల్లలు ఆడిషన్ ఇవ్వగా, కేవలం 14 మందికి మాత్రమే పూర్తి స్కాలర్‌షిప్ వచ్చింది. అందులో సింగర్స్ విభాగం లో ఎంపికైన ఏకైక విద్యార్థిని సుకృతి వేణి కావడం విశేషం.

# అలా ..రజనీకాంత్ గారితో జతకట్టా

## శ్రియా శరణ్ అనుభవాలు



టాలీవుడ్, కోలీవుడ్ తార నటి శ్రియ శరణ్ సూపర్ స్టార్ రజనీకాంత్ తో నటించిన 'శివాజీ: ది బాస్' సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన సంగతి తెలిసిందే. శ్రియ కెరీర్ లోనే అత్యధిక కలెక్షన్స్ సాధించిన చిత్రాలలో ఒకటిగా నిలిచింది. అయితే ఈ సినిమా షూటింగ్ సమయంలో జరిగిన ఒక మధురమైన జ్ఞాపకాన్నిశ్రియ తాజాగా పంచుకున్నారు. దర్శకుడు శంకర్ తనకు ఆ అవకాశం ఇచ్చిన వైనం గురించి ఆమె మాట్లాడుతూ..ఒకరోజు శంకర్ సర్ నాకు ఫోన్ చేసి, 'ఒక సినిమా ఉంది, అందులో పనిచేస్తావా?' అని అడిగారు. నేను సరేనని చెప్పాను, ఆయన 'సరే' అన్నారు. నేను అక్కడికి వెళ్లేసరికి చాలా మంది ప్రముఖులు వచ్చారు. ఎ.ఆర్. రెహమాన్ సర్, రజనీకాంత్ సర్ వచ్చారు. అప్పుడు నేను శంకర్ గారిని చూసి, 'ఇది కచ్చితంగా చాలా పెద్ద సినిమా అయి ఉంటుంది' అనుకున్నాను, ఎందుకంటే అక్కడ అంత పెద్ద వాళ్ళంతా గుమిగూడారు. అప్పుడు ఆయన నన్ను చూసి, 'మీ కో-స్టార్ రజనీకాంత్ సర్‌ని కలవండి' అని చెప్పారు. దానికి నేను షాక్ అయ్యి 'అవునా? సరే!' అన్నాను. ఆ తర్వాత అక్కడ ఎ.ఆర్. రెహమాన్ సర్ ఉన్నారు, అలాగే సినిమాటోగ్రాఫర్ కే.వి. ఆనంద్ సర్ కూడా ఉన్నారు' అంటూ రజనీకాంత్‌తో తన మొదటి పరిచయ క్షణాలను శ్రియ ఎంతో సరదాగా గుర్తుచేసుకున్నారు.

# CINEMA




# సినీ లవర్స్‌కు పండగే పండగ

## నేడు ఒక్కరోజే ఆరు సినిమాలు విడుదల

పంద్రాగస్ట్ సినీ లవర్స్‌కు పండగ చేయబోతోంది. పలు సినిమాలు 14న శుక్రవారం విడుదల కాబోతున్నాయి. ఇందులో సూర్య కథానాయకుడిగా వెంకీ అట్లూరి దర్శకత్వంలో రూపొందిన తాజా చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్'. మమితా బైజు కథానాయిక. రాధికా శరత్ కుమార్ కీలక పాత్ర పోషించారు. ఈ చిత్రం ఈనెల 14న థియేటర్లలోకి రానుంది. సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. ఇటీవల విడుదల చేసిన ప్రచార చిత్రం సినిమాపై అంచనాలను పెంచింది. పిస్టల్ షూటర్ సంజయ్ విశ్వనాథ్ (సూర్య) కొడుక్కి ఉన్న ఆరోగ్య సమస్య ఓ సవాల్‌గా మారుతుంది. ఆ బాబు ఆపరేషన్‌కి అవసరమైన అవయవదాతను వెతుకుతుండగా మ్యాడీ అనే యువతి పరిచయమవడం.. ఆమె రాకతో ఆ తండ్రీకొడుకుల జీవితాలు ఎలా మారాయన్నది చిత్ర కథ. విచిత్రమైన పాత్రలు... సరదా సంఘటనలు... ఊహించని మలుపులతో రూపొందుతున్న సినిమానే మా 'పళ్ళ బురుసు' అంటున్నారు ఉదయ్ చౌహాన్. ఆయన దర్శకత్వంలో.. సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రమిది. అన్నపూర్ణ స్టూడియోస్, ఎపిక్ స్టూడియోస్ సంయుక్త నిర్మాణంలో రూపొందింది. 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. కామెడీ, భావోద్వేగాల







మేళవింపుగా ఓ పల్లెటూరి కథతో మూవీని తీర్చిదిద్దినట్లు ప్రచార చిత్రం చూస్తే అర్థమవుతోంది.'ఆధ్యాత్మిక అంశాలతో మిళితమై ఉన్న మిస్టిక్ థ్రిల్లర్ 'అగధ' అంటున్నారు హీరో శ్రవణ్ రెడ్డి. ఆయన కీలక పాత్రలో కామాక్షి భాస్కర్ల, ఉల్కా గుప్తా, జోవికా విజయ్ కుమార్ ప్రధాన పాత్రధారులుగా నటించిన చిత్రమిది. ఎంఎస్ రాజు తెరకెక్కించారు. ఆగస్టు 14న ఈ మూవీ విడుదల కానుంది. ఇందులో భయపెట్టే అంశాలు మాత్రమే కాదు... అంతకుమించిన కథ ఉందని చిత్ర బృందం చెబుతోంది. 'నేటి యువతరానికి కనెక్ట్ అయ్యే సినిమా 'హుషార్ పిట్టలు'. తప్పకుండా అందరికీ నచ్చేలా ఉంటుంది' అంటున్నారు నిర్మాత డి.సురేశ్‌బాబు. అన్షు, వాసవి గణెళిశన్ జంటగా నటించిన ఈ చిత్రాన్ని బిక్షు తెరకెక్కించారు. వెంకట్ యాదవ్ నిర్మించారు. ఏషియన్ సురేశ్ ఫిల్మ్స్ సంస్థ విడుదల చేస్తోంది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. 'ఈ సమాజంలో కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా దీన్ని రూపొందించినట్లు దర్శకుడు చెబుతున్నారు. ఇకపోతే విశాల్ కథానాయకుడిగా నటిస్తూ.. స్వయంగా తెరకెక్కించిన చిత్రం 'మకుటం'. ఆర్బీ చౌదరి నిర్మాత. దుషార విజయన్, అంజలి కథానాయికలు. ఈ మూవీ తమిళ, తెలుగు భాషల్లో 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. లింగ, కృపాకర్ అనే రెండు వైవిధ్యమైన పాత్రల్లో మూడు విభిన్న గెటప్పులలో విశాల్ కనిపించిన విధానం.. యాక్షన్ అలరిస్తున్నాయి. బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ ప్రధాన పాత్రలో 2007లో దర్శకుడు మోహిత్ సూరి తెరకెక్కించిన సినిమా 'ఆవారాపన్'. ఇప్పుడీ సినిమాకి సీక్వెల్‌గా రూపొందిన చిత్రం 'ఆవారాపన్ 2'. ఇమ్రాన్ హష్మీ, దిశా పటానీ జంటగా నటిస్తున్నారు. నితిన్ కక్కర్ దర్శకుడు. ఆగస్టు 14న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలను పెంచాయి. ఇమ్రాన్ డైలాగ్స్‌తో పాటు దిశా నటన అలరిస్తోంది. ఇమ్రాన్ ఇందులో శివమ్ పండిట్ పాత్రలో కనిపించనున్నారు. సన్నీ డియోల్ ప్రధాన పాత్రలో రాజ్‌కుమార్ సంతోషి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'బట్వారా 1947' ప్రీతి జింటా, షబానా ఆజ్మీ తదితరులు కీలక పాత్రలు పోషించారు. బాలీవుడ్ కథానాయకుడు ఆమిర్ ఖాన్ నిర్మాణ సంస్థ రూపొందించిన చిత్రమిది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 14న విడుదల కానుంది. దేశ విభజన కాలం నాటి హింసాత్మక పరిస్థితుల మధ్య చిక్కుకున్న ఓ కుటుంబ నేపథ్యంలో భావోద్వేగభరితంగా ఈ సినిమాను తీర్చిదిద్దారు.




# రాకాలో మరో ముగ్గురు ముద్దుగుమ్మలు

- జాన్వీ, రష్మిక, మృణాల్ ఉన్నట్లుగా ప్రచారం





అల్లు అర్జున్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'రాకా' సినిమాకి సంబంధించి చిత్రబృందం ఇప్పటివరకూ అధికారికంగా బయట పెట్టింది కొన్ని విషయాలే! ఇందులో నటిస్తున్న తారాగణంపై కూడా ఇంకా పూర్తిగా స్పష్టత లేదు. కథానాయికగా దీపికా పదుకొణె పేరు మాత్రమే ఇప్పటివరకూ ఖరారైంది. ఆమెతోపాటు... మరో ముగ్గురు ప్రముఖ కథానాయికలు ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నట్టుగా ప్రచారం సాగుతోంది. అతిథి పాత్రల గురించి కూడా ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. ఆ పరంపరలోనే షారుక్ ఖాన్, షాహిద్ కపూర్ పేర్లు కూడా వినిపిస్తున్నాయి. ఈ సినిమాలోని కథానాయికల పాత్రలపై కూడా కొన్ని కీలకమైన విషయాలు వెలుగులోకి వచ్చినట్టుగా బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. మొదట్నుంచీ ముంబయిలోనే ఈ సినిమా చిత్రీకరణ సాగుతుండడం, అక్కడ్నుంచి పలు విషయాలు ప్రచారంలోకి వస్తుండడంతో సినీ ప్రేమికులు వాటి గురించి ప్రత్యేకమైన ఆసక్తిని కనబరుస్తూ చర్చించుకుంటున్నారు. దీపిక ఇందులో గర్భవతిగా కనిపించనున్నారని, ఆమె ప్రస్తుతం గర్భంతోనే ఉండటం సినిమాకి కలిసొచ్చిందని బాలీవుడ్ వర్గాలు చెప్పుకుంటున్నాయి. ఆమె ఈ నెలలోనే ఈ సినిమా చిత్రీకరణ పూర్తి చేయనున్నట్టు తెలుస్తోంది. అలాగే ఇందులో మరో కథానాయికగా నటిస్తున్న జాన్వీ కపూర్ ఓ గిరిజన యువతిగా శక్తిమంతమైన పాత్రలో కనిపిస్తారని, రష్మిక పాత్ర దీపికా పాత్ర చేసే పోరాటానికి మార్గ నిర్దేశనం చేసే పాత్రలో కనిపించనున్నారన్న ప్రచారం సాగుతోంది. ఇందులో మృణాల్ ఠాకూర్ కూడా ఓ కీలకపాత్రని పోషిస్తున్నట్టు సమాచారం. 'రాకా' ప్రపంచంపైనా, ఇందులోని పాత్రలపైనా స్పష్టత రావడానికి మరింత సమయం పడుతుంది. పురాణాలు, ఆధునిక కాలం మేళవింపుగా ఈ చిత్రం రూపొందుతున్నట్టు తెలుస్తోంది. అట్లీ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ సంస్థ అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తోంది.

# అతిగా ఫోన్ వాడకంతో 3 లక్షలు బొక్క

## నటి షకీలాకు చేదు అనుభవం



ప్రముఖ నటి షకీల ఇటీవల తనకు ఎదురైన ఒక భయంకరమైన ఆరోగ్య సమస్య గురించి అభిమానులతో పంచుకున్నారు. రీల్స్ మోజులో అతిగా మొబైల్ ఉపయోగించడం వల్ల తాను తీవ్రమైన మెడ నొప్పితో బాధపడ్డానని, దీనివల్ల రూ.3 లక్షల ఖర్చుతో శస్త్రచికిత్స చేయించుకోవాల్సి వచ్చిందని ఆమె వెల్లడించారు. ఈ విషయాన్ని తెలుపుతూ అభిమానులకు జాగ్రత్తలు చెప్పారు. ఫోన్‌లో చాలాసేపు గేమ్స్ ఆడటం, యూట్యూబ్, ఇన్‌స్టాలో రీల్స్ చూడటం వల్ల తనకు ఈ పరిస్థితి వచ్చిందని షకీల తెలిపారు. నిద్రపోయే సమయంలో కూడా ఒక పక్కకు వాలి గంటలు గంటలు ఫోన్ చూడటంతో మెడలోని నరాలపై తీవ్ర ప్రభావం పడిందని, అందుకే శస్త్రచికిత్స చేయించుకోవాల్సి వచ్చిందని ఆమె పేర్కొన్నారు 'ఫోన్ చాలా ముఖ్యం. కానీ, అవసరానికి మించి దాన్ని వాడకండి. ఉపయోగం లేని వీడియోలను చూస్తూ సమయం వృథా చేయకండి. సరిగ్గా వాడకపోతే డబ్బులు పోవడమే కాకుండా, భరించలేని నరకయాతన అనుభవించాల్సి వస్తుంది. చిన్న పిల్లలకు ఫోన్ ఇవ్వడంలో తల్లిదండ్రులు చాలా జాగ్రత్తగా ఉండాలి. మొబైల్ వాడకాన్ని తగ్గించాలి' అని షకీల కోరారు. 18 ఏళ్ల వయసులో 'ప్లే గర్ల్స్' అనే తమిళ చిత్రంతో షకీల ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. 2000 సంవత్సరంలో వచ్చిన మలయాళ చిత్రం 'కిన్నార తుంబికల్' ఆమె కెరీర్‌ను మలుపు తిప్పింది. డైరెక్టర్ తేజ రూపొందించిన 'జయం' సినిమాతో తెలుగులో ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత నిజం, బంగారం, తొట్టిగ్యాంగ్ వంటి పలు చిత్రాల్లో ఆమె నటించారు.

# లోకేశ్ కనగరాజ్ చిత్రం డిసికి పెరుగుతున్న కలెక్షన్లు



కోలీవుడ్ ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ హీరోగా అరంగేట్రం చేసిన తొలి చిత్రం 'డీసీ' బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన కలెక్షన్లతో దూసుకుపోతోంది. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహించిన ఈ తమిళ యాక్షన్ డ్రామా ఇండియన్ మార్కెట్లో మొదటి రోజు నుంచే మంచి వసుళ్లను రాబడుతున్న సంగతి తెలిసిందే. ఫస్ట్ డేనే రూ. 6 కోట్లకు పైగా వసుళ్లను రాబట్టిన ఈ చిత్రం అనంతరం వరుసగా కలెక్షన్స్‌తో దూసుకుపోతుంది. తాజాగా ఆరో రోజు కూడా బాక్సాఫీస్ వద్ద తన జోరును కొనసాగించింది. వర్కింగ్ డేస్‌లోనూ ఈ చిత్రం పట్టుసడలించకుండా మంచి వసూళ్లను రాబడుతోంది. కేవలం ఆరో రోజే భారతదేశంలో సుమారు రూ. 5 కోట్లు నెట్ రాబట్టగా, ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా కలెక్షన్లు రూ. 58.62 కోట్లకు పైగా చేరుకున్నాయి. వీకెండ్ కల్లా ఈ చిత్రం రూ. 60 కోట్ల మార్క్‌ను దాటే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. 'విక్రమ్', 'లియో', 'కూలీ' వంటి బ్లాక్‌బస్టర్ సినిమాలతో స్టార్ డైరెక్టర్‌గా గుర్తింపు తెచ్చుకున్న లోకేష్ కనగరాజ్, ఈ చిత్రంతో పూర్తి స్థాయి నటుడిగా మారడం విశేషం. ప్రస్తుతం లోకేష్ అల్లు అర్జున్‌తో 'ఏఏ23' ప్రాజెక్ట్‌ను తెరకెక్కించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

# రజనీకాంత్ ధర్మన్ మూవీ సెకండ్ షెడ్యూల్ ప్రారంభం



సూపర్ స్టార్ రజనీకాంత్ హీరోగా తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'ధర్మన్' చిత్రానికి సంబంధించిన క్రేజీ అప్‌డేట్ వచ్చేసింది. ఈ సినిమాకు సంబంధించి ప్రస్తుతం సెకండ్ షెడ్యూల్ షూటింగ్ ప్రారంభమైనట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా ఒక వీడియోను విడుదల చేసింది. 'ఓ మై కడవులే', 'డ్రాగన్' వంటి వైవిధ్యమైన చిత్రాలను తెరకెక్కించిన దర్శకుడు అశ్వత్ మారిముత్తు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా.. లోకనాయకుడు కమల్ హాసన్ తన సొంత నిర్మాణ సంస్థ అయిన 'రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్' బ్యానర్‌పై ఈ సినిమా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తు న్నారు. ఈ చిత్రంలో రజనీకాంత్ సరసన సిమ్రాన్, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తుం డగా, కమెడియన్ యోగి బాబు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఇక ఈ సినిమాకు సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. ఇక ఇదివరకే విడుదలైన ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌లో రజనీకాంత్ రక్తంతో తడిసిన సర్జికల్ టూల్ పట్టుకుని 'ది డెడ్లీ డాక్టర్' ట్యాగ్‌లైన్‌తో కనిపించి ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచేశారు. ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్న ఈ రెండో షెడ్యూల్‌తో సినిమాపై మరింత హైప్ క్రియేట్ అవుతోంది.